

ఇల్లే లేదు.. అప్పు ఎట్లా కట్టేది ?

ప్రశ్నిస్తున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు

రుణం చెల్లించాలని బ్యాంకర్ల ఒత్తిడి



7

ఆస్పత్రికి మాయరోగం

ఏఓ వేధిస్తున్నారని వైద్యులు, సిబ్బంది ఫిర్యాదు

- వైద్యులు ఆస్పత్రిలో లేక రోగులకు ఇబ్బందులు
- గాడితప్పిన పాలన..
- ఫిర్యాదులతో గందరగోళం

గుంతకల్లు పట్టణంలోని రాయ్ సాహెబ్ మిడతల హంపయ్య ఏరియా ఆస్పత్రిలో పరిపాలన గాడి తప్పింది. ఆస్పత్రి అధికారులు, సిబ్బంది ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకునే స్థాయికి పరిస్థితి దిగజారింది. ఏఓ రాంప్రసాద్ తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని పారిశుధ్య, సెక్యూరిటీ కాంట్రాక్టు సిబ్బంది జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. వైద్యులు కూడా అయనపై డీసీహెచ్ఎస్‌కు ఫిర్యాదు చేశారు. వైద్యులు మధ్యాహ్నం తరువాత కనిపించడం లేదని రోగులు వాపోతున్నారు. అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో పరిపాలన గాడితప్పింది. ప్రసూతి ఆపరేషన్లు మినహా ఇతర శస్త్ర చికిత్సలు చేయడం లేదు. ఆసుపత్రికి వచ్చిన రూ.32 లక్షల ఆరోగ్యశ్రీ నిధులు మురిగిపోయాయి. - ఆంధ్రజ్యోతి, గుంతకల్లు



ఏఓ తీరు వివాదాస్పదం..

మహిళా వైద్యులను ఏఓ రాంప్రసాద్ ఏకవచనంతో సంబోధిస్తున్నారని, బంధుత్వ వరుసలతో వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని ఇద్దరు వైద్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది పట్ల దురుసుగా వ్యవహరించడం వివాదాస్పదమైంది. బాధితులు డీసీహెచ్ఎస్‌కు ఫిర్యాదు చేశారు. వీరి కాంట్రాక్టులు డిసెంబరుతో ముగుస్తాయి. జనవరి నుంచి కొత్త వారిని నియమిస్తానని బెదిరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేకు కూడా ఆయనపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆయన అవినీతి గురించి డీసీహెచ్ఎస్‌కు ఫిర్యాదులు వెళ్లాయని, దీంతో తమను ఆఫీసుకు పిలిచి బెదిరిస్తున్నారని పారిశుధ్య సిబ్బంది వాపోతున్నారు.

ఏమీ చేయలేరా..?

ఆస్పత్రిలో రాజకీయాల కారణంగా సూపరింటెండెంట్ నిస్సహాయంగా మారిపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకూ విధుల్లో ఉండాలి. కానీ మధ్యాహ్నం తర్వాత వైద్యులు కనిపించడంలేదని రోగులు వాపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రక్తపరీక్షలు, ఎక్స్‌రే పరీక్షలు చేయించుకుని వస్తే.. వైద్యులు ఉండటం లేదని, మరుసటి రోజు రావాల్సి వస్తోందని అంటున్నారు. ఆర్థోపెడిక్, జనరల్ ఆపరేషన్లు చేయడంలేదని అంటున్నారు.



విచారణ ఏదీ..?

ఆస్పత్రిలో సమస్యలు, సిబ్బంది, వైద్యుల తీరుపై ఫిర్యాదులు వెళ్లినా.. జిల్లా అధికారుల నుంచి స్పందన కరువైంది. ఏఓ రాంప్రసాద్‌పై తనకు లిఖితపూర్వక ఫిర్యాదులు వచ్చాయని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ అన్నారు. విచారణ కోసం త్వరలో కమిటీ వేస్తానని తెలిపారు. కానీ పక్షం రోజులు గడిచినా ఎవరూ వచ్చింది లేదు.



ఏఓ ఆఫీసులో చేతులు కట్టుకుని నిలబడిన పారిశుధ్య సిబ్బంది

నాకు ఫిర్యాదులు రాలేదు..



ఏఓ రాంప్రసాద్ దురుసుగా వ్యవహరిస్తున్నారని కొందరు మౌఖికంగా తెలిపారు. కానీ ఎవరూ లిఖితపూర్వక ఫిర్యాదులు ఇవ్వలేదు. అతడిపై డీసీహెచ్ఎస్‌కు వైద్యులు, సిబ్బంది ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. కానీ జిల్లా కేంద్రం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. త్వరలో విచారణ చేపట్టవచ్చు. ఆస్పత్రిలో ఆర్థో ఆపరేషన్లకు సంబంధించిన పరికరాలు లేవు. ఈ కారణంగా శస్త్ర చికిత్సలు చేయడంలేదు. గైనిక్, జరనల్ ఆపరేషన్లను చేస్తున్నాము.

- డాక్టర్ అజేంద్రరావు, సూపరింటెండెంట్

బాధ్యతలు చేపట్టిన పెద్దాస్పత్రి ఏఓ



బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరెడ్డి

అనంతపురం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా డిప్యూటీ కలెక్టరు మల్లికార్జునరెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లా ఆస్పత్రుల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లుగా టీడీపీ కూటమి ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్లను నియమించింది. రెండు వారాల క్రితం సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల ఆర్డీఓగా ఉన్న మల్లికార్జున రెడ్డిని జిల్లా ఆస్పత్రి ఏఓగా నియమించారు. రెవెన్యూ అధికారుల హోదాను తగ్గించి ఇలా ఆస్పత్రులకు నియమించడం సరికాదని ఆ శాఖలో కొంత అసంతృప్తి వ్యక్తమైంది. దీంతో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు జాయిన్ అవుతారా లేదా అనే సందేహాలు తలెత్తాయి. కానీ వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఐదురోజుల క్రితం వీరి నియామకంపై మళ్లీ ప్రత్యేకంగా ప్రొసీడింగ్స్ ఇచ్చారు. దీంతో మల్లికార్జునరెడ్డి జిల్లాకు గురువారం వచ్చి, ఇన్‌చార్జి కలెక్టర్‌ను కలిశారు. ఆ తరువాత జిల్లా ఆస్పత్రికి చేరుకొని సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావును కలిసి బాధ్యతలు తీసుకున్నారు. ఆర్ఎంఓలు డాక్టరు శివకుమార్, డాక్టరు పద్మజ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కంటి విభాగం ప్రోగ్రామ్ ఆఫీసర్ గదిని ఆయనకు కేటాయించారు.

కొత్త వెలుగులు

సంక్షోభాన్ని దాటుకుని.. సంక్షేమం వైపు



ఐదేళ్ల వైసీపీ పాలనకు తెరదించి.. టీడీపీ కూటమికి అఖండ మెజార్టీతో అధికారాన్ని అప్పగించిన ఏడాది.. ఇంకో ఐదు రోజుల్లో చరిత్రలో కలిసిపోనుంది. పరిపాలన పరంగా చీకటి వెలుగుల అనుభవాలు జిల్లా ప్రజలు చూసిన ఏడాది.. 2024. తొలి ఐదు నెలలు వైసీపీ పాలన, ఆ తరువాత టీడీపీ కూటమి పాలన ఈ ఏడాది ప్రత్యేకం. ఉమ్మడి జిల్లాలోని అన్ని ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలలో అధికార పార్టీ ఓడిపోవడం జిల్లా చరిత్రలో మునుపెన్నడూ చోటు చేసుకోని పరిణామం. ఇది కూడా 2024లో లిఖితమైన చరిత్ర. సంక్షేమం, అభివృద్ధి పరంగానూ ఏడాది చివరి అర్ధభాగంలో పురోగతి కనిపిస్తోంది. కొత్త సంవత్సరంలోని నూతనోత్సాహంతో అడుగులు పడేవేళ.. ఈ ఏడాది జ్ఞాపకాల సమాహారం.. నేటి నుంచి..! - 6లో..

ఉపాధి జ్ఞాపకం.. మన్మోహన్

దేశంలో తొలిసారిగా అమలు.. 2006, 2016లో బండ్లపల్లిలో సభలు



కరువు కోరల్లో చిక్కుకున్న అనంత ప్రజలను గట్టెక్కించడానికి దేశంలోనే తొలిసారిగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రారంభించారు. రైతులు, కూలీలకు, మరీ ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ పథకం ఎంతగానో దోహదం చేస్తోంది. నార్పల మండలం బండ్లపల్లిలో ప్రధాని హోదాలో మన్మోహన్ సింగ్ ఈ పథకం ప్రారంభోత్సవ సభలో పాల్గొన్నారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ సభలో పాల్గొన్నారు. బండ్లపల్లి సర్పంచ్ వేల్పుల నారాయణరెడ్డి సభకు అధ్యక్షత వహించారు. ఆయన చేతనే ప్రధాని ఈ పథకాన్ని ప్రారంభింపజేశారు. సర్పంచ్‌తో కలిసి రాయలసీమ స్పెషల్ రాగి సంగటిని మన్మోహన్ తిన్నారు. ఆ తరువాత సరిగ్గా పదేళ్లకు తిరిగి బండ్లపల్లిలో నిర్వహించిన సభలో పాల్గొన్నారు. ఉపాధి పథకాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శలు గుప్పించారు. మన్మోహన్ మరణంతో జిల్లా ప్రజలు అప్పటి విషయాలను గుర్తు చేసుకుంటున్నారు. ఆయన మృతిపట్ల వివిధ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. - ఆంధ్రజ్యోతి, నార్పల

తోటలో పేకాట

రోజుకు రూ. 3వేలతో నిర్వాహకుల బంపరాఫర్



● ఎస్ఐ, సీఐలకు నేరుగా ముడుపులు ● ప్రతి రోజూ లక్షల్లో ఆట ● ఇతర ప్రాంతాల నుంచి ఆటగాళ్ల రాక

'మీకు తోట(పొలం) ఉందా...అందులో మామిడి, సపోట, లాంటి చెట్లుంటే చాలు. మీరేమీ పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. ఉదయం కొంతమందిమి ఓ చెట్టు కింద సేదతీరుతూ ముక్కలాట ఆడుకుంటాం.. సాయంత్రం వెళ్లిపోతాం...ఇందుకుగాను మీకు రోజుకు రూ.3వేలు ఉంటుంది. ఇదంతా గుట్టుగా ఉండాలి..' ఇది తోట యజమానులకు పేకాట నిర్వాహకులు ఇస్తున్న బంపర్ ఆఫర్. పేకాట నిర్వాహకుల పుణ్యమా అని కొందరు నెలకు రూ.90వేల వరకు సంపాదించుకునే అవకాశం కల్పించారు. జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. ఈ జూద వ్యవహారమంతా ఎవరో నలుగురు ఫ్రెండ్స్ కూర్చునే ఆట కాదు. చాలా సీరియస్‌గా...అత్యంత పకడ్బందీగా ఆడే హైక్లాస్ పేకాట. దూర ప్రాంతాల నుంచి సైతం వస్తారంటే ఈ బిజినెస్ ఏ రేంజ్‌లో సాగుతోందో అర్థమవుతుంది. పొలాలు, కొండల్లో వీటికి ప్రాధాన్యత ఉంది. నిర్వాహకులు అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులే ఉన్నట్లు సమాచారం.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

తోపులు వెతికి మరీ...

జిల్లాలో ఎక్కువగా పొలాల్లోనే పేకాట షోలు జరుగుతున్నాయి. మామిడి, సపోట, జామ లాంటి చెట్ల తోపులుండే పొలాల కోసం పేకాట నిర్వాహకులు గాలిస్తుంటారు. ఎవరైనా గుట్టుగా తమ పనికి అడ్డురాకుండా ఉండేలా ప్రణాళిక చేస్తారు. ఆ మేరకు ఆ పొలం యజమానికి రోజుకు రూ.3వేలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంటారు. అలా ఉదయం నుంచి సాయంత్రం వరకు పేకాట జరుగుతూనే ఉంటుంది. అందులో రమ్మీ(సిండికేట్) ఆడుతుంటారు. సాయంత్రం చివరి గంట, గంటన్నర వ్యవధిలో అందర్‌బార్ తిప్పేస్తారు. పోలీసులు వస్తారనేందుకు సూచనగా తోటకు కాస్త దూరంలో ఓ మనిషిని ఉంచుతారు. అతనికి రూ.500 ఇస్తారు. వీరికి మందు, సిగరెట్లు, స్నాక్స్ అవసరమైనప్పుడు పేకముక్కలు తీసుకురావడానికి మరో మనిషిని నియమించుకుంటారు. ఇందుకు అతడికి ఆ రోజుకే రూ.1000 ఇస్తారు.

ఎస్ఐ, సీఐలకు నేరుగా ముడుపులు..

పేకాట జూదం నడిపించేవారంతా పెద్ద తలకాయలే ఉంటున్నట్లు తెలుస్తోంది. వీరి నుంచి నేరుగా సంబంధిత ఎస్ఐ, సీఐల స్థాయిలోనే ముడుపులు వెళ్తుంటాయని సమాచారం. వారానికి ఇంత చొప్పున నెలకు ఇంత మొత్తం అని వారితో ముందుగానే ఒప్పందం చేసుకుంటారు. బయటకు రానంతవరకు తాము బాధ్యత వహిస్తామని.. పై వరకు వెళ్తే తామేమీ చేయలేమని కూడా చెప్పేస్తుంటారట. ఆ హామీలతో పేకాట నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. దీంతో చాలా మంది ఇలా పేకాట కేంద్రాలు పెట్టడానికి ఉత్సాహం చూపుతున్నట్లు తెలుస్తోంది.



చుక్కలూరు సమీపంలో ఇటీవల పట్టుబడిన జూదరులు

ఎక్కడెక్కడంటే...

జిల్లా వ్యాప్తంగా పేకాట కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు ప్రత్యేకంగా ఆదాయం కోసం పరితపించారు. ప్రభుత్వం సీరియస్ కావడంతో కొంతవరకు తగ్గింది. జిల్లా ఎస్పీ ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. అనంతపురం, శింగనమల, తాడిపత్రి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలో దాదాపు అన్ని చోట్ల ఈ వ్యవహారం సాగిస్తున్నారు. కొన్ని చోట్ల పెద్ద మొత్తంలో పేకాట వ్యవహారం నడుస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో చిన్న మొత్తంలో నడిపిస్తున్నారు.

- అనంతపురం నగరంలోని కొన్ని లాడ్జిలలో పేకాట నిర్వహిస్తున్నారు. మూడు వారాల క్రితం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో పోలీస్ శాఖ ప్రత్యేక బృందం పేకాటరాయుళ్లను పట్టుకుంది.
- అనంతపురం నగరంలో కొందరు రహస్యంగా పేకాట ఆడిస్తున్నారు. ఇక్కడ రూ.లక్షతో ఒక్కో ఆటగాడు ప్రారంభిస్తాడని సమాచారం. వారంలో మూడు రోజులు మాత్రమే ఆడించి మిగిలిన రోజులు విశ్రాంతి తీసుకుంటారట. ఆ సమయంలో వారికి మందు, మాంసం అన్ని సమకూరుస్తారని తెలుస్తోంది.
- అనంతపురం రూరల్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి సమీపంలోని ఓ పొలంలో తరచూ పేకాట ఆడుతుంటారని సమాచారం. ఇక్కడ పెద్ద మొత్తంలోనే పేకాట జరుగుతుంటుంది.
- శింగనమల నియోజకవర్గంలో పేకాట నిర్వాహకులు, పోలీసుల మధ్య మంచి సంబంధాలు నడుస్తున్నాయి. బుక్కరాయసముద్రం లోని కొన్ని కాలనీలు, నార్పల మండలం మద్దలపల్లి సమీపంలోని ఓ కొండ ప్రాంతం, పుట్లూరు మండలం మడుగుపల్లి సమీపంలోను, శింగనమల ఆకులేడు పరిధిలోని పొలాల్లో.. యల్లనూరు సమీపంలోని ఓ కేంద్రంలో పేకాట జోరుగా సాగుతోంది. రెండు నెలల క్రితం గార్లదిన్నె మండల పరిధిలో ఓ తోటలో పేకాట ఆడుతుండగా పోలీసులు పలువురిని అరెస్ట్ చేశారు.
- రాయదుర్గం నియోజకవర్గంలో ఇది వరకు పేకాట విస్తృతంగా జరిగింది. ప్రస్తుతం కర్ణాట సరిహద్దులో నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. బొమ్మనహాల్ మండలం దర్గా హొన్నూరులో పేకాట నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేయడంతో కొంతవరకు సద్దుమణిగింది. రాయదుర్గం పరిధిలో ఓ సీఐపై పేకాటను ప్రోత్సహించాడని ఆరోపణలు వచ్చాయి.
- కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనూ పేకాట తక్కువేం కాదు. శెట్టూరు మండలం తిప్పనిపల్లెలో (కర్ణాటక సరిహద్దు)పేకాట రోజూ జరుగుతుందట. ఆంధ్ర, కర్ణాటక వాళ్లు కలిసి ఆడే ఇక్కడ రూ.10లక్షల వరకూ ఆట ఉంటుందని సమాచారం.
- గుంతకల్లులో ఓ బృందం ప్రత్యేకంగా నిర్వహిస్తోందని సమాచారం. ప్రభుత్వ స్థాయిలో కొంత ఒత్తిడి రావడం పేకాట తగ్గినట్లు తెలుస్తోంది. గుత్తిలోనూ అదే తరహా కొనసాగింది. కానీ ఇప్పుడు కూడా కొన్ని ప్రాంతాల్లో గుట్టుగా నడిపిస్తున్నా పోలీసులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది.
- తాడిపత్రి పట్టణంలో రెండు వర్గాల మధ్య పేకాట నిర్వహణ విషయంలో తీవ్ర పోటీ నెలకొంది. ఇది చివరకు గొడవకు దారి తీసింది. ప్రత్యేకంగా పెద్ద మొత్తంలో పేకాట నిర్వహించేవారు. రెండు వర్గాల మధ్య ఈ విషయంలో వివాదం నెలకొనడంతో రెండు వారాల క్రితం శింగనమల మండలం ఇరువెందులలో నిర్వహించారు. ఆ సమయంలో ప్రత్యేక బృందం దాడి చేసి 26 మందిని అరెస్ట్ చేసి రూ.13.18 లక్షలపైగా నగదు స్వాధీనం చేసుకుంది.

డిఫెన్స్ మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

అనంతపురం అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని కళ్యాణదుర్గం రోడ్డులో ఎక్సైజ్ శాఖ అధికారులు ఓ వ్యక్తి నుంచి 69 డిఫెన్స్ మద్యం ఫుల్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వెంకట్ అనే వ్యక్తి బెంగళూరు నుంచి బస్సులో రెండు సూట్ కేసుల్లో 69 డిఫెన్స్ ఫుల్ బాటిళ్లను గురువారం తెచ్చాడు. బస్సు దిగి ఇంటి వరకు వాటిని తీసుకువెళ్లాడు. ముందస్తు సమాచారంతో అనంతపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు జయనరసింహ, జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి సిబ్బందితో అతన్ని అనుసరించారు. ఇంటి వద్దకు వెళ్లగానే పట్టుకున్నారు. సూట్ కేసులలో ఉన్న డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశారు. కొత్త సంవత్సరం వేడుకలు, పండుగల సందర్భంగా విక్రయించేందుకే మద్యాన్ని తెచ్చినట్లు గుర్తించారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చిరు జల్లులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా గురువారం చిరు జల్లులు కురిశాయి. అనంతపురం, యాడికి, గుంతకల్లు, పుట్లూరు, రాప్తాడు, కళ్యాణదుర్గం, బొమ్మనహాళ్ మండలాల్లో చిరు జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, ఆ తర్వాత సాయంత్రం ఆకాశం మేఘావృతం అయింది. చల్లటి వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గుంతకల్లు డీఆర్ఎంగా సీఎస్ గుప్తా

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

12 ద్విచక్రవాహనాల స్వాధీనం

7

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

మాన్యం భూములను కాపాడాలి.. నాలుగు గ్రామాల ప్రజల డిమాండ్

విడపనకల్లు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆలయ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ జనార్దనపల్లి, వేల్పుమడుగు, ఆర్ కొట్టాల, విడపనకల్లు ప్రజలు అనంతపురం-బళ్లారి 42వ జాతీయ రహదారిపై గురువారం బైఠాయించారు. రూకోట్ల విలువ చేసే భూమిని కొట్టేసేందుకు కడప జిల్లాకు చెందిన కరూర్ గుండురావు శర్మ కొడుకులు కాశీబొట్ల గుండురావు కొడుకుల అవతారమెత్తారని మండిపడ్డారు. జనార్దనపల్లిలో ఆలయాలకు ఇచ్చిన భూమి నివర్తి శంకరయ్య, శేషమ్మదంపతుల ఆస్తి అని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం రాగానే ఆ పార్టీ నాయకులు బినామీల పేరుతో మాన్యం భూములను కాజేశారని ఆరోపించారు. ఇప్పటి వరకూ మాన్యం భూమిని అక్రమంగా సాగుచేసినవారి నుంచి కౌలు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఇకపై మాన్యం భూముల నుంచి వచ్చే ఆదాయాన్ని పాండు రంగస్వామి, జనార్దనస్వామి, ఆంజనేయస్వామి, శ్రీరామస్వామి ఆలయాలకు ధూప దీప నైవేద్యాలకు వినియోగించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఆందోళనతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో విడపనకల్లు పోలీసులు అక్కడికి చేరుకుని ఉరవకొండ సీఐ చిన్న గౌస్‌తో చర్చించారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్ వచ్చి గ్రామస్థులతో చర్చించారు. ఈనాం భూమి గురించి విచారించి జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ జరిగి ఉంటే రద్దు చేయిస్తామని అన్నారు. దీంతో వారు ఆందోళన విరమించారు.



రాస్తారోకో చేస్తున్న నాలుగు గ్రామాల ప్రజలు

రక్త హీనతతో గర్భిణి మృతి

యాడికి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రక్త హీనత కారణంగా ఓ గర్భిణి(29) బుధవారం మృతిచెందారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాడికి మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన ఆమెకు ఇప్పటికే ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఆమె భర్త బుగ్గలో చికెన్‌షాపు నిర్వహిస్తున్నారు. ఆ మహిళకు మొదటి ప్రసవంలో ఇద్దరు కూతుళ్లు (కవలలు) జన్మించారు. వీరి వయసు ప్రస్తుతం ఐదేళ్లు. రెండో ప్రసవంలోనూ కూతురు జన్మించారు. తన వయసు ఏడాదిన్నర కాగా, ఆమె ప్రస్తుతం 8 నెలల గర్భిణి. కడుపు నొప్పితో బాధపడుతుండడంతో మంగళవారం ఉదయం తాడిపత్రిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు, గర్భంలోనే శిశువు మృతిచెందినట్లు గుర్తించారు. మృతిచెందిన మగ శిశువును తొలగించారు. ఆమె పరిస్థితి మరింత విషమంగా మారడంతో మంగళవారం రాత్రి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. రక్తహీనత కారణంగానే ఆమె మృతిచెందినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎనిమిది నెలల గర్భిణి అయిన ఆమె పేరు వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది వద్ద నమోదు కాకపోవడం గమనార్హం. గర్భిణి మృతి గురించి తెలుసుకుని వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది గ్రామానికి వెళ్లి విచారించారు. కుటుంబ సభ్యులు సరైన సమాచారం ఇవ్వలేదని, గర్భిణి అని చెప్పేందుకు ఇష్టపడలేదని వారు అంటున్నారు.

ఐసీడీఎస్‌లో నమోదు కాని వివరాలు



ధాన్యం కొనుగోలుపై శ్రద్ధ పెట్టండి

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

అనంతపురం అర్బన్/రాయదుర్గం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. అనంతపురం నగరంలోని తన నివాసంలో ఆ శాఖ డీఎం రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, రాయదుర్గం డిప్యూటీ తహసీల్దారు సుబ్రహ్మణ్యంతో ఆయన సమావేశమయ్యారు. రాయదుర్గం, శింగనమల నియోజకవర్గాల్లో ఈ ఏడాది రైతులు అధికంగా వరి పంటను సాగు చేశారని అన్నారు. మార్కెట్‌లో తగిన ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ మోతాదులో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. రెండు నియోజకవర్గాల్లో ఈ ఏడాది 37,500 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతులు పండించారని అన్నారు. ఇప్పటి దాకా 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం తరఫున కొనుగోలు చేశామని అన్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో అత్యధికంగా వరి ధాన్యం రైతుల వద్దనే ఉండిపోయిందని అన్నారు. అందుకే రైతులకు ఇబ్బది లేకుండా ఎక్కువ శాతం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. ఈ విషయం గురించి ఇప్పటికే జాయింట్ కలెక్టర్ తో చర్చించానని తెలిపారు. సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ ఎండీకి ఫోన్ చేసి, ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. మరికొంత ధాన్యాన్ని సేకరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని ఎండీ హామీ ఇచ్చినట్లు కాలవ తెలిపారు.



పౌర సరఫరాల శాఖ అధికారులతో మాట్లాడుతున్న కాలవ



వైసీపీ ప్రభుత్వ హయాంలో నం-2 ఎస్సీ హాస్టల్‌లో గోడచాటు నీడన లైన్లో నిలబడి భోజనం చేసేందుకు వెళ్తున్న విద్యార్థినులు




పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంతో కళకళలాడుతున్న గిల్డాఫ్ సర్వీస్ స్కూల్ పక్కనున్న ఎస్సీ ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు





కొత్త వెలుగులు





వైసీపీ కంటే మెరుగైన సంక్షేమాన్ని అందిస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ వస్తోంది. ఈక్రమంలోనే తొలుత పింఛన్ల మొత్తాన్ని పెంచి బకాయిలతో చెల్లించి భేష్ అనిపించుకుంది. అలాగే వైసీపీ పాలనలో నిధులు లేక నీరసించిపోయిన సంక్షేమ వసతిగృహాల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టింది. వాటి స్థితి గతులు తెలుసుకుని, క్రమంగా మెరుగు చేయడానికి నిధులను సైతం విడుదల చేసింది. ప్రజాప్రతిధులు సైతం ఇందుకోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇక ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత దక్కించుకున్న సీఎం చంద్రబాబు ప్రస్తుతం వాటి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తూ మహిళల జీవనోపాధుల పెంపుకోసం తపిస్తున్నారు. వైసీపీ పాలనలో మూసివేసిన అన్న క్యాంటిన్లను పునఃప్రారంభించి కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీర్చుతోంది. ఏరకంగా చూసినా గత వైసీపీ ప్రభుత్వం కంటే కూటమి సర్కారు ప్రజా సంక్షేమం కోసం మెరుగ్గా కృషి చేస్తోందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే గత వైసీపీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలన మధ్య తేడాలను ఎత్తి చూపుతున్నారు.

సంక్షోభాన్ని దాటి.. సంక్షేమం వైపు

- నెలల వ్యవధిలోనే వైసీపీ కంటే మెరుగైన సంక్షేమం
- అన్ని వర్గాలకు పెరిగిన పింఛన్ మొత్తాలు
- సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి నిధులు విడుదల
- డ్వాక్రా మహిళల స్వయం సమృద్ధికి చర్యలు
- పేదల ఆకలితీర్చే అన్న క్యాంటిన్ల పునఃప్రారంభం
- కూటమి ప్రభుత్వంపై పేద వర్గాల్లో కృతజ్ఞత



స్వయం సహాయక సంఘాల మహిళలు

నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో వైసీపీ పాలనలో సంక్షేమ వసతి గృహాల్లో అంధకారం అలముకుంది. వసతి గృహ భవనాలు శిధిలావస్థకు చేరుకున్నా, పైకప్పు పెచ్చులూడిపడుతున్నా, డ్రైనేజీ వ్యవస్థ దుర్భరంగా ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. వసతిగృహాలను పట్టించుకోమని కింది స్థాయి అధికారులు ఉన్నతాధికారులకు ఎన్నిసారు మొరపెట్టుకున్నా వారి వేదన అరణ్య రోదన అయ్యింది. ఫలితంగా పేదింటి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సంక్షేమ వసతి గృహాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతిగృహాల అభివృద్ధికి రూ. కోట్లల్లో నిధులు విడుదల చేసింది. దీనిపై పలువురు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్/క్లాక్‌టవర్/అర్బన్

నాడు-నేడుతో మాయ

వైసీపీ ఐదేళ్ల పాలనలో శిథిలమైన సంక్షేమ వసతిగృహాలకు మరమ్మతులు చేపట్టడంలో నాడు-నేడు పేరుతో మాయ చేసింది. జిల్లాలో 2019 నుంచి మరమ్మతులకు సంబంధించి నాడు-నేడు కింద ఉమ్మడి జిల్లాలో 150కిపైగానే వసతిగృహాలను ఎంపిక చేశారు. నిధుల సమస్యతో ఫేజ్-2 కింద ఎంపిక చేసిన వాటిని ఫేజ్-3కి బదలాయించారు. అక్కడ కూడా అవే కష్టాలు ఉత్పన్నం కావడంతో మరమ్మతులను అటకెక్కించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాల దుర్భర పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేస్తామని ప్రకటించింది. ఈక్రమంలోనే జిల్లాలో బీసీ సంక్షేమశాఖకు సంబంధించి 32, ఎస్సీ సంక్షేమశాఖ 36, ఎస్టీ సంక్షేమశాఖలో రెండు హాస్టళ్లు, ఒక రెసిడెన్షియల్ పాఠశాలను మరమ్మతుల కోసం ఎంపిక చేసి నివేదికలు పంపారు. అవన్నీ చెత్తబుట్టకే పరిమితమయ్యాయి. ఇలా నిధులు లేకుండా కేవలం నివేదికలతో గత వైసీపీ ప్రభుత్వం సరిపెట్టి, సంక్షేమాన్ని నీరుగార్చింది.

మంత్రి సవిత చొరవ



బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సంక్షేమ హాస్టళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎప్పటికప్పుడు ఉమ్మడి జిల్లా సంక్షేమశాఖల అధికారులు, వార్డెన్లతో సమావేశాలు నిర్వహిస్తూ... సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. మంత్రి స్వయంగా పలు హాస్టళ్లను పరిశీలించి... ఆయా సంక్షేమశాఖల అధికారులతో నివేదికలు తెప్పించుకొని వసతిగృహాల మరమ్మతుల కోసం నిధులు రాబడుతున్నారు. ఇలా ఇప్పటి వరకు దాదాపు రూ. 20 కోట్ల దాకా నిధులను రాబట్టారు. వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధులు ఒక్కరంటే ఒక్కరు కూడా సంక్షేమ వసతగృహాల అభివృద్ధిని పట్టించుకోలేదనే విమర్శలు వ్యక్తం అవుతనాన్నయి. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల చొరవతో సంక్షేమ వసతిగృహాలకు మహర్దశ పడుతోందని పలువురు సంక్షేమశాఖల అధికారులు, వార్డెన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆరునెలల్లోనే అభివృద్ధి

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల్లోనే ఆయా వసతిగృహాల అభివృద్ధికి చర్యలు తీసుకుంది. మొదటి నెలలోనే రాష్ట్ర వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన, సమస్యల నడుమ ఉన్న వసతిగృహాలకు సంబంధించిన నివేదికలను తెప్పించుకుంది. అనంత జిల్లాలో మొదటి విడతగా 10 ఎస్సీ హాస్టళ్లు, ఒక గురుకుల పాఠశాలను ఎంపిక చేసింది. ఆయా భవనాల మరమ్మతుల కోసం రూ.1.85 కోట్లు విడుదల చేసింది. మూడు నెలల్లోనే ఆయా వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టింది. అలాగే జిల్లాలో శిథిలావస్థకు చేరి, సమస్యలతో సతమతమవుతున్న హాస్టళ్లను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 55 బీసీ సంక్షేమ వసతిగృహాలను ఎంపిక చేశారు. ఇందులో 28 హాస్టళ్లకు మరమ్మతులు, మౌలిక వసతులు, 27 వసతిగృహాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు రూ. 3.67 కోట్ల అంచనా వ్యయంతో నివేదికలు పంపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 23 ఎస్సీ హాస్టళ్లలో సీలింగ్, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్, పెయింటింగ్ సమస్యలు గుర్తించారు. వీటి కోసం దాదాపు రూ. 5.85 కోట్లు నిధులను కేటాయించగా పనులు ముమ్మరం చేశారు. తాజాగా మరోమారు ఆ జిల్లాలో మరో 10 వసతిగృహాలకుపైగా అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించగా వాటి కోసం రూ. 11.56 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

డ్వాక్రా మహిళల కోసం..

స్వయం సహాయక సంఘాల మహిళలు (డ్వాక్రా) జీవనోపాధుల పెంపునకు కూటమి ప్రభుత్వం ఆర్థికపరమైన ప్రోత్సాహకాలు అందిస్తోంది. జిల్లాలో ఎస్సీ కేటగిరీలో 5,799 సంఘాల్లో 75,037మంది ఉండగా, ఎస్టీలో 1050సంఘాల్లో 15,846మంది, బీసీ కేటగిరిలో 24,237సంఘాలకు గాను 2,14,279మంది, ఓసీ కేటగిరిలో 4016సంఘాల్లో 61,644మంది, మైనార్టీ కేటగిరిలో 795సంఘాల్లో 12,627మంది మహిళలు ఉన్నారు. వీళ్లందరి అభివృద్ధి కోసం గతంలో కంటే కూటమి ప్రభుత్వంలో మెరుగైన పథకాలు తీసుకొచ్చారు. మహిళలకు పేదరికం నుంచి విముక్తి కల్పించి జీవనోపాధుల పెంపునకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.



పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

సొంతింటి కల నెరవేర్చేలా...

ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తున్నాం అంటూ గత వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. జగనన్న కాలనీల పేరిట స్థలాలు కేటాయింపు, లబ్ధిదారుల ఎంపిక, బిల్లులు చెల్లింపు వరకు అక్రమాలు జరగడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. వాటిని అలాగే వదిలేస్తే కేంద్రం నుంచి ఇళ్ల కేటాయింపులు, నిధుల మంజూరుపై ప్రభావం పడే అవకాశం ఉందని కూటమి ప్రభుత్వం గుర్తించింది. అందుకే వైసీపీ పాలనలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు మన- ఇల్లు - మన గౌరవం పేరిట కార్యక్రమం చేపట్టింది. పేదల సొంతింటి కల సాకారం చేయడానికి కూటమి ప్రభుత్వం వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణాల్లో శ్రీసత్యసాయి జిల్లాలో 5553 గృహ నిర్మాణాలు వచ్చే ఏడాది మార్చికి పూర్తిచేయాలని లక్ష్యం పెట్టి నిర్మాణాలు చేయిస్తోంది.



పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లి జగనన్న కాలనీలో ఆగిన నిర్మాణం

పింఛన్‌దారుల్లో ఆనందం

ఇప్పటి వరకూ కూటమి ప్రభుత్వంలో అత్యధికంగా లబ్ధిపొందినవారు పింఛన్‌దారులే. గత వైసీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ మొత్తంలో పింఛన్‌ను కూటమి ప్రభుత్వం అందిస్తూ ఆపన్నులకు ఆసరాగా నిలుస్తోంది. తాము అధికారంలోకి వస్తే పింఛన్ మొత్తాన్ని ఏప్రిల్ నెల నుంచే పెంచుతామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆమేరకు జూలై నెలలో పెంచిన పింఛన్‌తో పాటు మూడు నెలల బకాయిలను సైతం చెల్లించారు. జూలైకి సంబంధించి మొత్తం పింఛన్‌దారులు 2,89,995మందికి గాను పెంచిన సొమ్ముతో కలిపి రూ.127కోట్లు, బకాయిలు రూ.70.73కోట్లు మొత్తం రూ.197కోట్లు జిల్లాకు కేటాయించారు. గతంలో రూ.3000 పింఛన్‌ను ఏప్రిల్ నెల నుంచే రూ.4000కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దివ్యాంగులకు వైసీపీ ప్రభుత్వంలో చెల్లిస్తున్న రూ.3000లను కూటమి ప్రభుత్వం రూ.6000కు పెంచింది. పెరాలసిస్ బాధితులకు రూ.5000నుంచి కూటమి ప్రభుత్వం రూ.15వేలకు పెంచింది. కిడ్నీ బాధితులు, థలసేమియా వంటి రోగులకు పింఛన్ మొత్తాన్ని రూ.5000నుంచి కూటమి ప్రభుత్వం రూ.10వేలుకు పెంచింది. పింఛన్ పెంపు పట్ల ఆయా వర్గాల్లో సంతోషం, ప్రభుత్వం పట్ల కృతజ్ఞత వ్యక్తం అవుతోంది.

వంటింటికి వెలుగులు..



దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో పల్లె సింధూరరెడ్డి (ఫైల్)

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొన్ని నెలలకే రేషన్ కార్డు లబ్ధిదారులకు దీపావళి కానుక ఇచ్చింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా నవంబరు ఒకటి నుంచి గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 536289 కనెక్షన్లకి ఉచితంగా సిలిండర్లు అందుతున్నాయి. ఉచిత గ్యాస్ సిలిండర్ తీసుకున్న లబ్ధిదారులకు సిలిండర్ ధర బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి





అనంతపురంలోని బళ్లారి బైపాస్‌లో అన్న క్యాంటిన్‌కు కొత్త కళ

పేదల ఆకలి తీర్చుతున్న అన్న క్యాంటిన్

గత టీడీపీ పాలనలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్లు పేదల ఆకలి తీర్చేవి. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్న క్యాంటిన్లను మూసివేసింది. దీంతో జిల్లా కేంద్రం, పట్టణ ప్రాంతాలకు పలు పనులపై వచ్చిన ప్రజలు, పట్టణంలో కూలి పనులు చేసుకొని బతికే నిరుపేదలు, భిక్షాటన చేసే వారు అన్నం కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతకు ముందు నిత్యం వివిధ వర్గాల ప్రజలతో కళకళలాడిన క్యాంటిన్లు మందుబాబులు, అసాంఘిక వర్గాలకు అడ్డాగా మారాయి. అయితే మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటిన్లు పునఃప్రారంభమయ్యాయి. అనంతపురంలో మూడు అన్న క్యాంటిన్లు నడుస్తున్నాయి. గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం పట్టణాల్లో ఒక్కోటి ఏర్పాటు చేశారు. ఈ క్యాంటిన్ల ద్వారా రూ.5లకే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి డిన్నర్ పెడుతున్నారు. ప్రతి రోజు ఉదయం టిఫిన్‌లో భాగంగా రోజు వారి షెడ్యూల్ మేరకు ఇడ్లీ, పూరి, పొంగల్, ఉప్మా పెడుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో షెడ్యూల మేరకు వైట్ రైస్ తోపాటు పప్పు, సాంబార్, పచ్చడి, పెరుగు ఇస్తున్నారు. టిఫిన్, భోజనం ఏదైనా రూ.5లకే పేదలకు అందిస్తున్నారు. జిల్లాలోని ఒక్కో అన్న క్యాంటిన్‌లో ప్రతి రోజు 1000 మందికిపైగా టిఫిన్, భోజనం తింటున్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది ఆగస్టు నెలలో అన్న క్యాంటిన్లను ప్రారంభించి కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీరుస్తోంది.



బళ్లారి బైపాస్‌లో వైసీపీ హయాంలో అన్న క్యాంటిన్ దుస్థితి

జనవరిలో జిల్లాకు కరువు అంచనా కమిటీ

ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరువు మండలాల్లో పరిస్థితుల అంచనాకు కేంద్ర మినిస్టీరియల్ కమిటీ జిల్లాకు రానుందని ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణ శర్మ పేర్కొన్నారు. దీనిపై కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారుల తో ఇన్‌చార్జ్ కలెక్టరు గురువారం సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు కరువు మండలాలలో పర్యటించి, పరిస్థితులను అంచనా వేస్తారని తెలిపారు. జనవరి 2,3తేదీల్లో ఈ కేంద్ర కమిటీ వస్తుందన్నారు. ఈకమిటీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. 2024ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన ఏడు ప్రాంతాలను కరువు మండలాలుగా ఇప్పటికే ప్రకటించినట్లు తెలిపారు. కేంద్రకమిటీ కూడా అనంతపురంరూరల్, నార్పల, బుక్కరాయసముద్రం, రాప్తాడు, గార్లదిన్నె, యాడికి, విడపనకల్లు మండలాల్లో పర్యటిస్తుందన్నారు. అక్కడ ఈకమిటీ కరువు పరిస్థితులను పరిశీలించి అంచనావేస్తుందన్నారు. ఆయా శాఖల అధికారులు పక్కా సమాచారాన్ని కమిటీకి చూపించాలని ఇన్‌చార్జ్ కలెక్టరు ఆదేశించారు. కమిటీకి వసతి, పర్యటనకు వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కరువుకు సంబంధించిన పరిస్థితుల ఫొటోలను చూపించడానికి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వర్షపాతం, పంటలు తదితర అన్నిరకాల వివరాలు దగ్గర ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిటీ పర్యటన రూట్‌మ్యాప్, పోలీస్ బందోబస్తు ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జలజీవన్‌మిషన్ పనులు, ఉపాధి పనులు, భూగర్భజలాల పరిస్థితులు కమిటీ దృష్టికి తీసికెళ్లాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, డ్వామా పీడీ సలీమ్‌బాషా, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, డీపీఎం ఆనంద్, ఐసీడీఎస్ పీడీ వనజాఅక్కమ్మ, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, గ్రౌండ్‌వాటర్ ఏడీ జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ

ఆంధ్రా అండర్-23 జట్టుకు జిల్లా క్రికెటర్ ఎంపిక



మహేంద్రరెడ్డి



కోచ్ బొమ్మన్న

అనంతపురం క్లాక్‌టవర్/తాడిపత్రి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-23 జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు మహేంద్రరెడ్డి ఎంపికయ్యాడు. 2024-25 సీజన్‌లో బీసీసీఐ అండర్-23 వన్డే టోర్నీలో ఆంధ్రా జట్టు తరఫున మహేంద్రరెడ్డి పాల్గొన్నాడు. ఇతడు తాడిపత్రి ఆర్డీటీ క్యాంపునకు చెందిన క్రీడాకారుడని ఏటీఎల్ లలిత గురువారం తెలిపారు. గతంలో అండర్-14, 16, 19లో పాల్గొని మంచి ప్రతిభ చూపాడని తెలిపారు. రాంచీలో జరిగే అండర్-23 పోటీల్లో ఆంధ్రాజట్టు తరఫున మహేందర్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాకు చెందిన బొమ్మన్న ఆంధ్రా అండర్-23 మహిళా జట్టుకు ఎస్‌సి (స్ట్రెంత్ అండ్ కండీషనింగ్) కోచ్‌గా నియమితులయ్యారు. ఎంపికైన మహేంద్రరెడ్డి, బొమ్మన్నకు జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

విదేశీ భాషలతో ఉపాధి

ఎస్కేయూ వీసీ అనిత



ఆర్డీటీ ఫారిన్‌లాంగ్వేజ్ డిప్లొమా సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విదేశీ భాషలతో(ఫారిన్ లాంగ్వేజ్‌లతో) నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగం లభిస్తోందని ఎస్కే యూనివర్సిటీ వీసీ అనిత తెలిపారు. స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో 2025 విద్యా సంవత్సరానికి గాను ఆర్డీటీ ప్రొఫెషనల్ స్కూల్‌లో ఫారిన్‌లాంగ్వేజ్ ఆన్‌లైన్ కోర్సు ప్రారంభోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ ఆర్డీటీ ప్రవేశపెట్టిన ఫారిన్‌లాంగ్వేజ్ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కోర్సుల నిర్వహణ, ఎస్కేయూతో పరస్పర ఒప్పందం చేసుకోవడం శుభపరిణామమన్నారు. ఇందులో స్పానిష్, జర్మన్, ఫ్రెంచ్, పోర్చుగీస్ వంటి ఫారిన్‌లాంగ్వేజ్ కోర్సులు ఉంటాయన్నారు. వీటికి ఎస్కేయూ ద్వారా శిక్షణ తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఓ వైపు టీచర్లకు, మరోవైపు నిరుద్యోగులకు ఫారిన్ లాంగ్వేజ్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయని తెలిపారు. నిరుద్యోగులకు శిక్షణతో పాటు ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందించడం, ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పీజీ డిప్లొమా సర్టిఫికెట్లు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్‌డెవలప్‌మెంట్ డైరెక్టర్ నాగభూషణం రాజు, ఆర్డీటీ డైరెక్టర్ నిరంజన్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

మొబైల్ హెల్త్ వాహనం ఏర్పాటు చేయండి

ఐఓసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు ఎంపీ అంబికా వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి జూనియర్ డాక్టర్ల బృందం మెడికల్ క్యాంప్‌లు నిర్వహించేందుకు సీఎస్ఆర్ నిధుల నుంచి మొబైల్ హెల్త్ వాహనాన్ని ఏర్పాటు చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఐఓసీ) అనిల్ కుమార్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. గుంతకల్లు, అనంతపురం, గుత్తి, తాడిపత్రి రైల్వే స్టేషన్లల్లో వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం బ్యాటరీ వాహనాలు (బుగ్గి) ఏర్పాటు చేయాలని కోరారు.

గుంతకల్లు డీఆర్ఎంగా సీఎస్ గుప్తా



గుంతకల్లు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజరుగా రైల్వే ఇంజనీరింగ్ శాఖకు చెందిన సీఎస్ గుప్తాను నియమిస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం విజయకుమార్ డీఆర్ఎంగా ఇక్కడ విధులను నిర్వర్తిస్తున్నారు. గత జూలైలో అవినీతి ఆరోపణలపై అప్పటి డీఆర్ఎం వినీత్ సింగ్‌ను సీబీఐ అరెస్టు చేయడంతో ఆయన స్థానంలో విజయకుమార్ తాత్కాలిక ప్రాతిపదికన డీఆర్ఎంగా గుంతకల్లు డివిజన్‌కు నియమితుడయ్యారు. విజయకుమార్ స్థానంలో బెంగళూరు మెట్రో రైల్ సర్వీస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులను నిర్వర్తిస్తున్న సీఎస్ గుప్తాను నియమిస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ ఉత్తర్వులను వెలువరించింది. త్వరలో ఆయన గుంతకల్లు డీఆర్ఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు.

టమోటా కిలో రూ.12

అనంతపురం రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 12తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 825 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 25,290 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్య దర్శి గోవిం దు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10 వేలు, సరాసరి రూ. 16 వేలుతో అమ్ముడు పో యి నట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 14 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఇన్‌ఫ్లో 774 క్యూసెక్కులు

బెళుగుప్ప, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 774 క్యూసెక్కులు ఉన్నట్లు గురువారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 172 క్యూసెక్కులు వెళుతోందని వివరించారు. ప్రస్తుతం 1.681 టీఎంసీల నీటి నిల్వ వుందని వెల్లడించారు.

శతాధిక వృద్ధుడి మృతి



కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోయిలపల్లికి చెందిన నల్లబోతుల హనుమంతప్ప (101) అనే శతాధిక వృద్ధుడు గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈ సంవత్సరం సెప్టెంబరు 18వ తేదీన వందవ పుట్టినరోజు వేడుకలను తన కుమారులు, మనవళ్ల, మునిమనవళ్లతో ఎంతో ఘనంగా జరుపుకున్నారు. వంద సంవత్సరాలు ఉన్నప్పటికీ ఎంతో ఉల్లాసంగా వుండేవారని తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం.. కేసు నమోదు

గోరంట్ల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోహన్‌రావు కాలనీకి చెందిన 22ఏళ్ల విద్యార్థిని అదృశ్యమైనట్లు గురువారం సీఐ శేఖర్ తెలిపారు. అనంతపురంలో బీఎస్సీ నర్సింగ్ మూడవ సంవత్సరం చదువుతోందని, సెలవుల నిమిత్తం స్వగ్రామం గోరంట్లకు వచ్చిం దన్నారు. ఈనెల 22వ తేదీ రాత్రి నుంచి కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ఇల్లే లేదు.. అప్పు ఎట్లా కట్టేది ?

ప్రశ్నిస్తున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు
రుణం చెల్లించాలని బ్యాంకర్ల ఒత్తిడి
ఎక్కడికక్కడ నోటీసులు జారీ చేస్తున్న వైనం
అయోమయంలో బాధిత వర్గాలు


టిడ్కో ఇళ్లు

అనంతపురం సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇంకా ఇల్లే అప్పగించలేదు. కానీ రుణం మాత్రం చెల్లించాలంటూ బ్యాంకర్లు నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గత టీడీపీ పాలనలో ప్రారంభించిన టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. లబ్ధిదారుల సంఖ్యను సైతం తగ్గించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16272మందికి ఇళ్లు కట్టించి ఇస్తామని మమ అనిపించింది. ఏళ్లు గడిచినా లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేరలేదు. అంతలోనే బ్యాంకుల నుంచి నోటీసులు రావడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో టిడ్కో ఇళ్ల పరిస్థితి ఇలా...

- టీడీపీ పాలనలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సంఖ్య: 50,914
- వైసీపీ రద్దు చేసిన లబ్ధిదారుల సంఖ్య: 34,642
- రద్దు చేసిన లబ్ధిదారులకు చెల్లించాల్సిన నగదు: రూ. 33 కోట్లు
- వైసీపీ ఇళ్లు కట్టిస్తామని ప్రకటించిన వారి సంఖ్య : 16,272
- ఐదేళ్లలో కట్టించి అప్పగించిన లబ్ధిదారుల సంఖ్య: 370 మాత్రమే
- ఇంకా కట్టించాల్సిన టిడ్కో ఇళ్ల సంఖ్య : 15,902
- బ్యాంకర్లు నోటీసులు పంపించిన సంఖ్య : 50శాతం
- కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు: సుమారు రూ. 40 కోట్లు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంతే...

ఉమ్మడి జిల్లాలో గత టీడీపీ పాలనలో 50,914ఇళ్లను మంజూరు చేయగా.. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కార్ వాటిని నిర్మించలేమని చేతులేత్తేసింది. 16,272 ఇళ్లను కట్టించి మిగిలిన 34,642మందికి సంబంధించిన (వారు చెల్లించిన నగదు) రూ. 33 కోట్లు వెనక్కి ఇస్తామని ప్రకటించింది. ఇవన్నీ మాటలకే పరిమితమయ్యాయి. లబ్ధిదారులకు డబ్బు చెల్లించలేదు, ఇళ్లూ కట్టించలేదు. గత ఐదేళ్లలో కేవలం 370 ఇళ్లను మాత్రమే అదీ కూడా 2024 ఎన్నికల ముందు హడావుడిగా పూర్తి చేసి సదరు లబ్ధిదారులకు అప్పగించారు. మిగిలిన 15,092 ఇళ్ల పరిస్థితి మాత్రం నేటికి అగమ్యగోచరంగా ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణం ఆగిపోయినట్లు అధికార వర్గాల సమాచారం. ప్రభుత్వాలు మారేయేగానీ.. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు మాత్రం తీరలేదు. ఇంతలోనే రుణం చెల్లించాలని బ్యాంకర్లు నోటీసులు జారీ చేయడంతో బాధిత వర్గాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి.

టిడ్కో ఇళ్ల పథకం అమలు తీరు ఇదీ...

టిడ్కో ఇళ్లను మూడు కేటగిరీలుగా విభజించారు. లబ్ధిదారుడి వాటా కింద రూ.1 కి (300 చదరపు అడుగులు) కలిగిన సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు(దీనికి ఎలాంటి రుణం ఉండదు) 365 చదరపు అడుగులు కలిగిన సింగల్ బెడ్ ఇల్లు కావాలనుకునే లబ్ధిదారుడు రూ. 25,000 చెల్లించాలి. బ్యాంకు రూ.3.15లక్షలు రుణం మంజూరు చేస్తుంది. మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. వీటితో పాటు 430 అడుగులతో డబుల్ బెడ్ రూం కలిగిన ఇల్లు పరంగా.. లబ్ధిదారుడి వాటా రూ. 50,000 చెల్లిస్తే, బ్యాంకు రూ. 3.65లక్షలు రుణం ఇస్తుంది. మిగిలిన అమౌంట్ రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా టిడ్కో ఇళ్లకు అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఎంతో ఆశగా మధ్య తరగతి ప్రజలు నగదును చెల్లించి లబ్ధిదారులుగా చేరిపోయారు. అయితే వైసీపీ సర్కార్ టిడ్కో ఇళ్లను ఏమాత్రం పట్టించుకోలేదు.

మూడు నెలల నుంచి నోటీసులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు గత మూడు నెలల నుంచి నోటీసులు జారీ చేస్తున్నారు. ఆయా లబ్ధిదారులకు సంబంధించిన సబ్సిడీ సొమ్ము తీసివేసి మిగిలిన రుణాన్ని చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిసింది. కొన్ని ప్రాంతాల్లో బ్యాంకర్లతో లబ్ధిదారులు వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా బ్యాంకులు సైతం ఆ లబ్ధిదారుల అకౌంట్‌లను ఎన్‌పీ చేసినట్లు తెలిసింది. దీంతో ఆ అకౌంట్ నుంచి లావాదేవీలు జరగకపోవడంతో బాధిత లబ్ధిదారులకు బ్యాంకింగ్ సేవల పరంగా అంతరాయం ఏర్పడుతోంది. టిడ్కో ఇల్లు తెచ్చిన తంట తమ బ్యాంకు సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోందని బాధిత వర్గాలు వాపోతున్నాయి. ప్రధానంగా సిబిల్ స్కోర్‌పై ప్రభావం చూపడంతో భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50శాతం మందికి నోటీసులు జారీ చేశారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఇప్పటికే నిర్మాణాలు ఆపేశారు.


అప్పట్లో ఇచ్చిన ధ్రువ పత్రాలతో వనజ

ప్రభుత్వానికి నివేదించాం

నోటీసుల విషయమై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి నివేదించాం. బ్యాంకర్లకు కూడా తగిన గడువు ఇవ్వాలని సూచించాం. ప్రస్తుతానికి నోటీసులు పంపకుండా ఉండాలని చెప్పాం. కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వారు పనులు చేయడం లేదని తెలిసింది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం.

- సుధారాణి, టిడ్కో ఈఈ



ఇల్లే రాలేదు.. రుణం ఎలా చెల్లించాలి?: నాగేంద్ర, ఆదర్శనగర్

మాకు డబుల్ బెడ్ రూం (టిడ్కో) ఇల్లు మంజూరు కావడంతో నిబంధనలు ప్రకారం లబ్ధిదారుడి వాటాగా మొదట రూ. 50 వేలు చెల్లించాం. ఇంతవరకు టిడ్కో ఇళ్లు మాకు అప్పగించలేదు. బ్యాంకర్లు మాత్రం రుణం చెల్లించాలని నోటీసులు పంపారు. చెల్లించకపోతే బ్యాంకు అకౌంట్ ఎన్‌పీ చేస్తామని చెప్పి హోల్డ్ చేశారు. దీంతో బ్యాంకింగ్ సేవలు కూడా ఆగిపోయాయి. టిడ్కో ఇళ్లే రాలేదు. అప్పుడే రుణం చెల్లించమంటే ఎలా? నేను ఆటో నడుపుకుంటూ నా భార్య, ఇద్దరు పిల్లలు పోషించుకుంటున్నా. మాకు ప్రభుత్వమే న్యాయం చేయాలి.



రూ.50వేలు వెనక్కి ఇవ్వలేదు: వనజ

మాది రుద్రంపేట. నా భర్త ప్రైవేట్ ఉద్యోగి. నేను టైలరింగ్ చేస్తూ మా ఇద్దరు పిల్లల్ని పోషించుకుంటున్నాం. టీడీపీ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇంటి కోసం రూ.50 వేలు డీడీల రూపంలో చెల్లించాం. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం మా టిడ్కో ఇంటిని రద్దు చేసింది. మేము చెల్లించిన నగదు వెనక్కి ఇస్తామని చెప్పింది. కానీ.. ఇంత వరకు ఇవ్వలేదు. నగదు చెల్లించి ఆరేళ్లవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా నగదు వెనక్కి ఇవ్వాలి. లేకుంటే టిడ్కో ఇల్లైనా మంజూరు చేసి న్యాయం చేయాలి.

సమర్థవంతంగా దేహదారుఢ్య పరీక్షలు

ఎస్పీ జగదీష్
పోలీస్ అధికారులు, ఐటీ కోర్ టీం సిబ్బందితో సమావేశం

అనంతపురం క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు (స్టైపండరీ) దేహదారుఢ్య పరీక్షలు సమర్థవంతంగా నిర్వహిద్దామని జిల్లా ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. జిల్లాలోని పోలీసు అధికారులు, జిల్లా పోలీస్ కార్యాలయం, ఐటీ కోర్ టీం సిబ్బందితో ఎస్పీ గురువారం స్థానిక పోలీస్‌కాన్ఫరెన్స్ హాలులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ, సిబ్బంది బాధ్యతలపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 30 నుంచి జనవరి 17వరకు స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో అభ్యర్థులకు ఫిజికల్ మెజర్మెంట్, ఎఫిషియన్సీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పురుష అభ్యర్థులు 5242, మహిళా అభ్యర్థులు 1237 మంది మొత్తం కలిపి 6479 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్‌లెవల్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఏపీఎస్ఎల్ఆర్‌బీ) ఆదేశాలు, నియమనిబంధనల మేరకు ఈ పరీక్షలు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలు బయోమెట్రిక్ అథెంటికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు, ఆర్ఎఫ్ఐడీ ట్యాగుల పంపిణీ, ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు(1600 మీటర్లు, 100మీటర్ల పరుగు, లాంగ్ జంప్), వెరిఫికేషన్-2(స్పెషల్ బెనిఫిట్స్, లోకల్ స్టేటస్), రిజల్ట్ కౌంటర్ వరకు అంచెలంచెలుగా సమగ్రంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అభ్యర్థులు ఆయా తేదీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్సు కాపీలు వెంట తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేష్, రవిబాబు, శ్రీనివాస్, రామకృష్ణుడు, నీలకంఠేశ్వర్‌రెడ్డి(ఏఆర్), జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి రఘురాంనాయక్, సంబంధిత రిక్రూట్మెంట్ విభాగం క్లర్క్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వందేళ్లుగా నిత్యపోరాటం

సీపీఐ నేతలు


మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిత్య పోరాటాలే వందేళ్లుగా సీపీఐని నడిపిస్తున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీపీఐని స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలోని పలు కాలనీల్లో, వాడల్లో పార్టీ జెండాలు రెపరెపలాడాయి. కల్పనాజోషి కాలనీ, పాతూరు రాణి నగర్, చాకలి ఐలమ్మ కాలనీ, రాకెట్ల నారాయణరెడ్డి కాలనీ, బిందెల కాలనీ, పారతమ్మ కాలనీ, అనంతపురం రూరల్, నవయుగ కాలనీ ఇలా అనేక కాలనీల్లో స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి వందేళ్ల సీపీఐ వేడుకలను ఘనంగా చేశారు. సీపీఐ జెండాలు ఎగరవేసి...విప్లవ నినాదాలు చేశారు. తర్వాత కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ పతాకాన్ని జిల్లా కార్యదర్శి జాఫర్ ఆవిష్కరించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ 1925లో డిసెంబరు 26న కాన్పూర్‌లో తమ పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు. అనేక పోరాటలతో నిత్యం ప్రజల్లో ఉంటోందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శులు మల్లికార్జున, నారాయణస్వామి, జిల్లా కార్యవర్గసభ్యులు లింగమయ్య, నగర కార్యదర్శి శ్రీరాములు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్, ప్రముఖ న్యాయవాది వేణుగోపాల్, ఇతరనాయకులు రవీంద్రనాథ్, అల్లిపీరా, రాజేష్, చెన్నకేశవులు, వరలక్ష్మి, భాగ్యమ్మ, కృష్ణుడు, చిరంజీవి ఇతర నేతలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువతి మృతి

తనకల్లు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండకాడపల్లికి చెందిన శ్రావణి (22) బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించింది. ఆమె బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. తండ్రి సత్యనారాయణ పెళ్లి చేసుకోమని చెప్పడంతో పెళ్లి ఇష్టం లేక ఈనెల 23న ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లిలోని ఆర్డీటీకి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

ఆటో బోల్తాపడి బాలుడు...

డి.హీరేహాళ్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడి జగదీష్(12) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటక మొలకాల్మూరు తాలూకా కొండ్లపల్లి గ్రామానికి చెందిన గురుమూర్తి గురువారం ఉదయం సొదట్టి యల్లమ్మ దేవి దర్శనం కోసం స్వగ్రామం నుంచి కుటుంబసభ్యులతో కలిసి ఆటోను బాడుగకు తీసుకుని బయల్దేరాడు. ఉదయం 9 గంటల ప్రాంతంలో బళ్లారి - రాయదుర్గం రోడ్డుపై కల్యం గ్రామం సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో గురుమూర్తి కుమారుడు జగదీష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో ఉన్న మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జగదీష్ మృతి చెందాడు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుండి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కుమారుడి మృతితో గురుమూర్తి దంపతులు బోరున విలపించారు.

పాముకాటుతో మహిళ మృతి


సక్కుబాయి(ఫైల్)

యాడికి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చందన గ్రామానికి చెందిన సక్కూబాయి(53) పాము కాటుతో మృతి చెందారు. పొలంలో పనులు చేస్తుండగా బుధవారం పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి డిమాండ్


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు అనుచితమని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు సాగింది. అక్కడ ప్లకార్డులు పట్టుకొని పెద్ద ఎత్తున కేంద్రమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తర్వాత అక్కడ నుంచి ర్యాలీగా సప్తగిరి సర్కిల్ మీదుగా కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ డీఆర్వో మలోలకు వినతిపత్రం సమర్పించి, తమ డిమాండ్‌ను అధికారికంగా రాష్ట్రపతికి పంపి అమిత్ షాపై తగిన చర్యలు చేపట్టేలా చూడాలన్నారు. మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు, అనంతపురం ఇన్‌చార్జ్ దాదాగాంధీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, ఈరన్న, రహంతుల్లా, జిల్లా కార్యదర్శి శీనా, తాడిపత్రి ఇన్‌చార్జ్ సూర్యనారాయణరెడ్డి, గుంతకల్లు ఇన్‌చార్జ్ మహేంద్ర పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

12 ద్విచక్రవాహనాల స్వాధీనం

బొమ్మనహాళ్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ అరెస్టు చేశారు. అతడి నుంచి 12 ద్విచక్రవాహనాలను రికవరీ చేశారు. ఈ వివరాలను గురువారం కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు వెల్లడించారు. శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి గ్రామానికి చెందిన వీ సురేష్ బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు, నేమకల్లు, ఉద్దేహాళ్, కణేకల్లుక్రాస్, రాయదుర్గం పట్టణం, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణంలో దుకాణాల ముందు, దేవాలయ వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేసే వాడన్నారు. నేమకల్లు క్రాస్ వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో సురేష్ పట్టుబడినట్లు తెలిపారు. రూ.ఏడు లక్షలు విలువ చేసే 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సురేష్‌పై బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్‌లో మూడు, కణేకల్లు, రాయదుర్గం, బళ్లారి ప్రాంతాల పోలీస్‌స్టేషన్‌లలో ఒక్కో కేసు నమోదైనట్లు తెలిపారు. ఇతడిని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో రాయదుర్గం సీఐ వెంకటరమణ, ఎస్ఐ నబీరసూల్, ఏఎస్ఐ మల్లికార్జున, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.


రికవరీ చేసిన ద్విచక్రవాహనాలను చూపిస్తున్న పోలీసులు

ఇద్దరు దొంగల అరెస్టు

15 ద్విచక్రవాహనాలు, బంగారం స్వాధీనం

గుంతకల్లు, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీలు, ద్విచక్రవాహనాలను అపహరించిన ఇదరిని కసాపురం పోలీసులు అరెస్టు చేశారు. కసాపురం పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు కేసు వివరాలను గురువారం సాయంత్రం వెల్లడించారు. పట్టణంలోని మస్తాన్ పేటకు చెందిన బీ రఘు, ఉమామహేశ్వర నగర్‌కు చెందిన షెక్షావలిని అదుపులోకి తీసుకుని విచారించగా, వీరు ఇళ్లల్లోనూ, ద్విచక్రవాహనాలను దొంగతనం చేసిన కేసుల్లో నిందితులుగా గుర్తించామన్నారు. రఘు నుంచి 14 ద్విచక్రవాహనాలు, షెక్షావలి నుంచి ఒక బైక్, 27 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. నిందితులను రిమాండుకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టణంలో జరిగిన దొంగతనాలు, బైక్‌ల తస్కరణపై నిఘా పెట్టి నిందితులను పట్టుకున్న కసాపురం ఎస్ఐ టీపీ వెంకటస్వామి, సిబ్బంది సుంకన్న, జాఫర్, కిషోర్ కుమార్, రాఘవేంద్ర, నాగేశ్వర రావు, భూపతి, అంజి, నూర్ మహమ్మద్‌ను డీఎస్పీ ప్రశంసించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ టీపీ వెంకట స్వామి, సిబ్బంది

ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతల నుంచి తొలగింపు

అనంతపురం సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని ఇద్దరు ఏఈలకు గతంలో ఇచ్చిన ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతలు తొలగిస్తూ ఆశాఖ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా డీఈఈ స్థానాలను మరో ఇద్దరు రెగ్యులర్ డీఈఈలకు అప్పగించారు. ఉరవకొండ పీఐయూ ఏఈగా పనిచేస్తున్న తిరుపాల్‌ను గతంలో శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిర పీఐయూ ఇన్‌చార్జి డీఈఈగా నియమించారు. జిల్లాలోని తాడిపత్రి పీఆర్ఐ సబ్ డివిజన్‌లో యాడికి ఏఈగా పనిచేస్తున్న యల్లంనాయుడికి అదే సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతలు అప్పగించారు. అయితే అదే శాఖలో పనిచేస్తున్న ఓ ఏఈ సీనియారిటీని పాటించకుండా ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతలు అప్పగిస్తున్నారని హైకోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాల మేరకు ఆ ఇద్దరు అధికారులను ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతల నుంచి తొలగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. గుత్తి డీఈఈగా పనిచేస్తున్న డీఎల్ మురళీధర్‌కు తాడిపత్రి డీఈఈగాను, హిందూపురం డీఈఈగా పనిచేస్తున్న మల్లికార్జునకు మడకశిర డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇన్‌చార్జి డీఈఈల బాధ్యతల తొలగింపుతో ఆ ఇద్దరు ఏఈలు తమ పాత స్థానాల్లో పనిచేయాల్సి ఉందని ఆ ఉత్తర్వుల్లోనే పేర్కొన్నారు.

సంక్షిప్తం

నిజపాద స్పర్శ దర్శనం



రుక్మిణీసమేత పాండురంగ స్వామి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్గశిరమాస శుక్ల పక్ష ఏకాదశిని పురస్కరించుకుని గురువారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద స్పర్శ దర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మూల విరాట్లకు ఫలపంచామృతాభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విరి విగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

రేపటి నుంచి సిద్ధి గణపతి యాగం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండో రోడ్డులో వెలసిన శ్రీ జ్ఞానపఠం ఆవరణలో శని, ఆదివారాల్లో సిద్ధిగణపతి యాగం నిర్వహిస్తున్నట్లు గుహానంద మండలి అధ్యక్షుడు విద్యానందనాథస్వామి పేర్కొన్నారు. శ్రీ జ్ఞానపీఠం, గుహానంద మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత బ్రోచర్లను గురువారం పీఠం ఆవరణలో ఆవిష్కరించారు. భక్తులు విరివిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీ జ్ఞానపీఠం కార్యవర్గం గోటేటి శ్రీనివాసరావు, లక్ష్మి, మధుసూదన్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

అనంతపురం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుల చేశారు. ఉదయం పదిగంటలకు సమావేశం అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలన్నా రు. ప్రజాప్రతినిధులు, ఎంపీ టీసీలు, సర్పంచు హాజరు కావాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నార్పల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి):టీడీపీ అనుబంధ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో ముద్రించిన 2025నూతన సంవత్సరం క్యా లెండరను టీడీపీ యువ నాయకుడు మె ల్లంపూటి శివకృష్ణచౌదరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ బలోపేతంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల పాత్ర కీలకమైందన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు మెల్లంపూటి జగదీష్, కాంద్ర రాజేష్, మనోహర్, లిఖిత్, తిరుమల నాయుడు, వెంకటేష్, గౌతమ్, రాయవరం వెంకటరమణ పాల్గొన్నారు.

విశాలాఫెర్రర్‌కు సన్మానం



విశాలాఫెర్రర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సౌత్ ఇండియన్ ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్‌ను ఘనంగా సన్మానించారు. స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆమెకు ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో శాలువా, పుష్పగుచ్ఛం, మొమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఫైట్‌ఫర్ రైట్స్ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, నాగరాజు, మీనాక్షమ్మ ఫౌండేషన్ అధినేత రవికాంత్ రమణ, సభ్యులు కమలనాథ్, సుధాకర్, తరిమెల రాజు, పవన్, అమర్‌నాథ్‌రెడ్డి, హరి, శంకర్‌రెడ్డి, సుధాకర్ రాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ గోదాముల పరిశీలన



గోదామును పరిశీలిస్తున్న మార్కెటింగ్ డైరెక్టర్

అనంతపురం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత పలు వ్యవసాయ గోదాములను పరిశీలించారు. గురువారం జిల్లాకు వచ్చిన ఆమె మరూరు టోల్ ప్లాజా సమీపంలోని గోదామును పరిశీలించారు. అక్కడి నుంచి రూరల్ మండలం పరిధిలోని ఎ నారాయణపురం గ్రామంలో ఉన్న వ్యవసాయ గోదామును పరిశీలించారు అందుబాటులోకి తీసుకురావాలని కో-ఆపరేటివ్ సొసైటీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ రామాంజినేయులు, ఏడీ సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా..!

- వైసీపీ ప్రభుత్వంలో గిడ్డంగులు నిర్మించినా ప్రయోజనం శూన్యం
- పంటలు నిల్వ చేసుకోలేక నష్టపోతున్న రైతులు



శింగనమలలో వినియోగంలోకి రాని గిడ్డంగి

శింగనమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించని పరిస్థితుల్లో... కొంత కాలం పాటు భద్రపరచుకోవడానికి, ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలకు ఆదాయం రావాలన్న అలోచనతో గత వైసీపీ ప్రభుత్వంలో గిడ్డంగులు నిర్మించారు. భవనాలు పూర్తి అయినా ఇంత వరకు వినియోగంలోకి రాలేదు. లక్షల రూపాయల నాబార్డు నిధులు వెచ్చించి నిర్మించినా రైతులకు అందుబాటులోకి రాలేదు. దీంతో పంటలను రోడ్డుపై ఆరబోసుకున్నారు. వర్షాలు కురవడంతో తీవ్రంగా నష్ట పో యారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన గిడ్డంగులతో తమకు ఎలాంటి లాభం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాబార్డు నిధులతో శింగనమల మండలంలో రైతుల ఉత్పత్తుల సంఘం ఆధ్వర్యంలో వెస్టునరసాపురం, శింగనమలలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కల్గిన రెండు గిడ్డంగులు నిర్మించారు. అలాగే ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో శింగ నమలలో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో, ఈస్టు నరసాపురంలో రూ.40 లక్షలతో 500 టన్నుల మెట్రిక్ సామర్థ్యంతో గిడ్డంగులు నిర్మించారు. తరిమె లలో రూ.60 లక్షల నిధులు వచ్చినా పనులు ప్రారం భం కాలేదు. శింగనమలలోని రెండు, ఈస్టునర సాపురం, వెస్టు నరసాపురంలోని గిడ్డంగులు పూర్తి అయినా క్షేత్రస్థాయిలో వినియోగానికి తీసుకురా వడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వినిపి స్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో వాటికి మోక్షం కల్పించి రైతులకు ఉ పయోగపడే చర్య లు తీసు కోవాలని రైతులు కోరుతు న్నారు.

అధికారులకు అప్పగించలేదు

మండలంలో నాలుగు గిడ్డంగులను నిర్మించినా నాబార్డు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. నిర్మాణాలు పూర్తి అయినా కొద్ది మేరకే బిల్లులు వచ్చాయి. మిగిలిన బిల్లులు వస్తే అప్పుడు గిడ్డంగులను అప్పగిస్తామని కాంట్రాక్టర్లు అధికారులకు తెగేసి చెప్పినట్లు సమాచారం.

రోడ్డుపైనే పంటలను ఆరబోసిన రైతులు

మండలంలో రైతులు సాగు చేసిన వరి, కంది, మొక్కజొన్న పంటలు గత 25 రోజులుగా కోత పడుతున్నాయి. అయితే ఓ వైపు గిట్టుబాటు ధర లేకపోవడం, మరో వైపు వర్షం కారణంగా రైతులు కోసిన పంటను కాపాడుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో రోడ్లపై ఆరబో స్తు న్నారు. అయితే వర్షాలకు తడిసిపోవడంతో రోడ్ల పైనే రాశులు పోసి, తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. దీంతో రైతులు నష్టాల్లో మునిగిపోయారు. అదే గిడ్డంగు లు అందుబాటులో ఉంటే పంటను అం దులో ఉంచి గిట్టుబాటు ధర వచ్చినపుడు అమ్ముకునే వారమని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గిడ్డంగులు రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

15రోజుల పాటు రోడ్డు మీదే..



కోతకు రావడంతో వరి పంటను కోశా. అప్పుడే వర్షం కురవడంతో తడిసిపోయింది. ఎక్కడా అవకాశం లేకపోవడంతో 15 రోజల పాటు రోడ్డుపై ఆరబోశాం. రాశు ల్లోనే మొలకలు రావడంతో పంటను కోనుగోలు చేయడానికి ఎవరూ రాలేదు. 15 రోజల తరువాత తక్కువ ధరకే అమ్ముకున్నా. పంటలు నిల్వ చేయడానికి గిడ్డం గులు నిర్మించారు. కానీ తాము ఇంత ఇబ్బందులు పండుతున్నా వాటిని వినియో గించుకునే అవకాశం లేదు.

- ప్రభాకర్, రైతు, కొరివిపల్లి

గిడ్డంగులుంటే ఇబ్బందులు ఉండవు



మా గ్రామంలో వరి మంచి దిగుబడి వచ్చింది. అయితే గిట్టుబాటు ధర లేకపోవడంతో 20 రోజులుగా రోడ్డులోనే పంటను ఆరబోశాం. వర్షానికి తడిసిపోయింది. మండలంలో మొత్తం 3000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గిడ్డంగుల నిర్మించారని తెలుసు. కానీ వినియోగం లోకి రాలేదు. దీంతో ఇబ్బందులు పడుతు న్నాం. రైతులు ఇబ్బందులు పడుతున్నా గిడ్డంగులు ఉన్నాయనే విషయం అధికారులు తెలియజేయలేదు. పంట వర్షానికి తడవడంతో తక్కువ ధరకే అమ్ముకున్నాం.

- ఆదెప్ప, రైతు, కొరివిపల్లి

అధికారులు స్వాధీనం చేసుకోవాలి



జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ గిడ్డంగుల నిర్మాణాలు చాలా వరకు పూర్తయ్యాయి. అయితే బిల్లులు రాలేదనే నేపంతో కాంట్రాక్టర్లు వాటిని అధికా రులకు అప్పజెప్పలేదు. గత నెలలో వర్షాలకు పంటలు తడిసి పోయా యి. వాటిని ఆరబెట్టు కోవడానికి రైతులు రోడ్లలోనే కిలోమీటర్ల మేరకు పోసి రాత్రింబగళ్లు కష్టాపడ్డారు. అయితే గిట్టుబాట ధర లేక పోవడంతో తక్కువ ధరకే అమ్ముకుని నష్టపోయారు. గత వైసీపీ ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించి నిర్మించినా రైతులకు ఉపయోగం లేదు. ఇప్పటికైనా అధికారులు కాంట్రాక్టర్లు నుంచి స్వాధీనం చేసుకోవాలి.

- చిన్నప్పయాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

మాకు అప్పగించలేదు

శింగనమల మండలంలో నాలుగు గిడ్డంగులు నాబార్డు నిధులతో పూర్తి అయ్యాయి. అయితే ఇంకా బిల్లులు రాలేదు. దీంతో కాంట్రాక్టర్లు వాటిని మాకు అప్పజెప్పలేదు.

- నారాయణ స్వామి, సీఈఓ, శింగనమల సొసైటీ

ఘనంగా సీపీఐ శతాబ్ది వేడుకలు



సోమలదొడ్డి గ్రామంలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సీపీఐ శత వసంతోత్సవాలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమలదొడ్డి గ్రామంలో గురువారం పార్టీ రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ, మండల సహాయ కార్యదర్శి నరేష్, కక్కలపల్లి కాలనీలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేశవరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. మన్నీలలో గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు రామాంజినేయులు, ఆకుతోటపల్లిలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి, ఐజినగర్‌లో మండల కార్యదర్శి రమేష్ పార్టీ జెండాలు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు పోతలయ్య, మన్నిల వెంకటరాముడు, అజయ్‌కుమార్, నాగేష్, శారద, ఓబులేసు, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: మండలంలోని శింగనమల, తరిమెల, నిదనవాడ గ్రామాల్లో సీపీఐ శత వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. శింగనమలలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు చెన్నప్పయాదవ్, సీనియర్ నాయకుడు వెంకటరెడ్డి కేకు కట్ చేశారు. తరిమెల, నిదనవాడలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు తరిమెల రామాంజినేయులు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.

● బుక్కరాయసముద్రం: సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి టి నారాయణస్వామి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న జెం డా స్థూపం వద్ద పార్టీ శత వసంతాల ఉత్స వాలను ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్క రించారు. సీపీఐ మండల కార్యదర్శి మద్రిస్వామి, నా యకులు చాకల హరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఐ వసంతోత్సవాలను ఘనం గా ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర్ పార్టీ జెండాను ఆవిష్క రించారు. నాయకులు చాపల రామాంజి, నాగ రాజు, సుధాకర్, లలితమ్మ, నాయకులు నారాయణప్ప, పెద్దక్క, నూరి, తిరుపతమ్మ తదితరులుపాల్గొన్నారు.

● రాప్తాడు: సీపీఐ శత వసంతాల ఉత్సవాలను గురువారం ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాప్తాడులోని సీపీఐ కాలనీలో పార్టీ జెండా ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు చలపతి, రాము, మల్లప్ప, రామాంజినేయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

అనంతపురం క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కొందరు వ్యక్తులు చికెన్ సెంటర్ నిర్వాహకుడిపై దాడి చేశారు. నాలుగో పట్టణ పోలీ సులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆరో రోడ్డుకు చెందిన వాల్మీకి సాయితేజ, షెక్షావలి గురువారం సాయంత్రం బళ్లారి బైపాస్‌లోని భవిష్య చికెన్ సెంటర్‌కు వెళ్లారు. రూ.40కు కబాబ్ ఇవ్వమన్నారు. రూ.20 నగదు ఇచ్చి రూ. 20 ఫోన్‌పే చేశామన్నారు. నిర్వాహకుడు అడపాల వెంకటేష్ రాలేదన్నాడు. మళ్లీ వచ్చి ఇస్తామని చెప్పిన వారిద్దరూ... వాల్మీకి రాము, మరో ఇద్దరిని పిలుచుకొచ్చి వెంకటేష్‌పై దాడికి దిగారు. స్థానికులు సమాచారం అందించడంతో ఫోర్త్ టౌన్ పోలీసులు వచ్చి వారిని పట్టుకెళ్లారు.

ఎస్‌ఐని పరామర్శించిన ఎస్పీ

నగరంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తాడిపత్రి అర్బన్ ఎస్‌ఐ నాగవీరయ్యను ఎస్పీ జగదీష్ పరామర్శించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న నాగవీరయ్యను తాడిపత్రి ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో అనంతపురంలోని సవేరాకు తీసుకొచ్చారు. నాగవీరయ్యకు మెరుగైన వైద్యం అందించాలని ఎస్పీ సూచించారు. ఎస్‌ఐ కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం కల్పించారు. ఎస్పీ వెంట సీఐ సాయినాథ్ ఉన్నారు.

చిరువ్యాపారులపై ప్రతాపం

- పెద్ద సంస్థల పరిస్థితేంటో..?
- కార్పొరేషన్ అధికారుల తీరుపై పలువురి విమర్శలు



చిరువ్యాపారులకు సూచిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

అనంతపురం క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరపాలిక టౌన్‌ప్లానింగ్ అధికారులు సుభాష్‌రోడ్డులో షో చేశారు. ప్రధాన రహదారిలోని గురువారం ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేస్తున్న తోపుడుబండ్ల వ్యాపారులపై ప్రతాపం చూపారు. ఫుట్‌పాత్‌లపై ఎలా వ్యాపారాలు చేస్తారు... వెంటనే తీసివేయాలని ఆదేశించారు. దీంతో వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా ఇక్కడే వ్యాపారం చేసుకుంటున్నామని, ఇప్పుడు ఎలా తొలగించాలని ప్రశ్నించారు. తమ కుటుంబాలను రోడ్డుపాలు చేస్తారా... అంటూ వాపోయారు. టౌన్‌ప్లానింగ్ టీపీఓ శిరీష, టీపీఎస్ మంజులు సిబ్బందితో కలిసి గురువారం సుభాష్‌రోడ్డులోకి వెళ్లారు ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై ఫుత్‌పాత్‌పై వ్యాపారం చేస్తున్న తోపుడుబండ్లను తొలగించాలని ఆదేశించారు. కొన్నింటిని తొలగించారు. అయితే నగరంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలపై చర్యలు తీసుకోకుం డా చిరు వ్యాపారులపై పడటం ఏమటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆక్రమణలెన్నో..?

సుభాష్‌రోడ్డులోని అదే ఫుట్‌పాత్‌పై ఎన్నో ఆక్రమణలున్నాయి. కానీ వాటి గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. ఫుట్‌పాత్‌పై ఏడీసీసీ బ్యాంకు కట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణం మెట్లు ఫుత్‌పాత్‌ను ఆక్రమించి నిర్మించారు. ఏడీసీసీ కార్యాలయం ప్రధాన ద్వారం గేటును బయట ఉంచారు. ఇది ఫుత్‌పాత్‌ను ఆక్రమించింది. ఓ ప్రైవేట్ షాపింగ్‌కు సంబంధించి ఫస్ట్‌ఫ్లోర్ పై భాగం ఫుత్‌పాత్‌ను ఆక్రమించింది. కానీ ఇవేవీ టీపీఓ శిరీషకు కనిపించినట్లు లేదని జనం అసహనం వ్యక్తం చేస్తున్నా. ప్రైవేట్ ప్లేస్‌లో వ్యాపారం చేసుకుంటున్నా, అందులోనూ దుకాణదారుడికి నెల అద్దె చెల్లిస్తున్నా, తనను ఎలా తీసేయమంటారంటూ ఓ వ్యక్తి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు.



ఏడీసీసీ షాపింగ్‌కాంప్లెక్స్‌లో ఫుట్‌పాత్‌పై మెట్లు



ఫుట్‌పాత్‌పై ఏడీసీసీ ప్రధాన ద్వారం గేటు భాగం

వైభవంగా సామూహిక షష్టిపూర్తి



సామూహిక షష్టిపూర్తిలో పాల్గొన్న దంపతులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సాయి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నగర శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో చేపట్టిన సామూహిక షష్టిపూర్తి కార్యక్రమం వైభవంగా సాగింది. ఈ నేపథ్యంలో తిరుక్కడయురి అభిరామ అమ్మవారి క్షేత్రానికి చెందిన వెంకటేష్ స్వామి శిష్యబృందం నేతృత్వంలో 170 మంది దంపతులకు మంగళస్నానాలు, గోపూజ, రుద్రాభిషేకాలతో పాటు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, సీతారాములు, శివపార్వతుల కల్యాణోత్సవాలు నిర్వహించారు. తదనంతరం హైదరాబాద్‌కు చెందిన గోవిందపీ ఠం గోవర్ధనం వెంకటాచార్యులు పురంధరనారాయణస్వామి పర్యవేక్షణలో దేవరకొండ బాలాజీశర్మ, గిరిప్రసాద్‌శర్మ, అర్చక బృందం సామూహిక షష్టిపూర్తిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, బల్లా కన్వెన్షన్ అంబటి అఖిల్, సాయి ట్రస్టు సిబ్బంది, షష్టి పూర్తి చేసుకున్న దంపతులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

'ఐఎంఎం సేవలు అభినందనీయం'

అనంతపురం కల్చరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఐఎంఎం ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు జేఎల్ మురళీధర్ కొనియాడారు. నగరానికి చెందిన ఓ ముస్లిం యువతి వివాహానికి ఐఎంఎం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం జేఎల్ మురళీధర్ చేతులమీదుగా రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

'ఆలయ అభివృద్ధికి కృషి'

అనంతపురం కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మూడో రోడ్డు షిర్డీ సాయిబాబా ఆలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడు గంగన లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. ఆలయ కమిటీ నూతన కార్యవర్గం గురువారం సాయంత్రం ఆలయ ఆవరణలో ప్రమాణస్వీకారం చేసింది. లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ... ఆలయం అభివృద్ధితో పాటు విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వైకుంఠం జయచంద్రచౌదరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు శశిధర్, గంగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్, కార్యదర్శి రఘురామరావు, సహాయ కార్యదర్శులు జయచంద్రనాయుడు, మధుసూదన్, కోశాధికారి సతీష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోండి

- తహసీల్దార్ మోహన్‌కుమార్

అనంతపురం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మోహన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కురుగుంట గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. గ్రామస్థులు, రైతుల నుంచి తహసీల్దార్ అర్జీలు స్వీకరించారు. ఇందులో కోర్టు పరిధిలో ఉండే వాటిని తాము పరిష్కరించేందుకు వీలుండదన్నారు. రైతులు గమనించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మంజునాథ్, ఆర్‌ఐ సందీప్ కృష్ణ, వీఆర్వోలు రామకృష్ణ, సాయి, చిన్నంపల్లి సర్పంచు శివశంకర్, తెలుగు రైతు రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షులు నారాయణస్వామి, టీడీపీ నాయకులు వెంకటరాముడు, సజ్జలకాలువ రాము పాల్గొన్నారు.

వాట్సాప్ ఫిర్యాదుపై ఎమ్మెల్యే స్పందన



చెత్తాచెదారాన్ని తొలగించిన సిబ్బంది

అనంతపురం అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అర్బన్ పరిధిలోని ఆజాద్ నగర్‌లో చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోయిందని, తద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు వాట్సాప్ ద్వారా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఎంత మందికి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని అందులో పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. ఆజాద్ నగర్‌లోని చెత్తాచెదారాన్ని వెంటనే శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. సిబ్బంది ద్వారా చెత్తాచెదారాన్ని తొలగించారు. దీంతో స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంఎస్‌ఎంఈ సర్వే వేగంగా చేపట్టండి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ ఆదేశం

అనంతపురం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ యూనిట్ల సర్వేను జిల్లాలో వేగంగా చేపట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ సర్వేను ఎంతో ప్రాధాన్యంగా తీసుకుందన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నాటికి సర్వే ముగుస్తుందన్నారు. ఇందుకు ప్రత్యేకయాప్‌ను రూపొందించారన్నారు. జిల్లాలో 89,500ఎంఎస్‌ఎంఈలు ఉండగా, ఇప్పటి వరకు 14వేలే సర్వే చేశారన్నారు. జనవరిలోగా పూర్తిచేయాలన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల అవసరాలను గుర్తించడంలో ఈసర్వే సహాయపడుతుందన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీదర్, డీసీఓ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా వీర బాలదివస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో ధైర్య సహసాలు నింపేలా జిల్లా వ్యాప్తంగా గురువారం వీర బాలదివస్ వేడుకలు నిర్వహించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి ధర్మం కోసం, దేశం కోసం పునరంకితం అయ్యేలా కృషిచేయాలని కోరారు. నాయకులు దుద్దకుంట వెంకటేశ్వరరెడ్డి, చిరంజీవిరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం సెంట్రల్: విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంపొందించే పునాదులు పాఠశాలలని బీజేపీ యువమోర్చా నాయకులు శ్రీనాథ్ పేర్కొన్నారు. బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో గురువారం వీర బాల దివస్‌ను నిర్వహించారు. నగరంలోని రెండో నెంబర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి శ్రీనాథ్ ముఖ్య అతిథులుగా హాజరై బాలవీరులకు నివాళులర్పించి మాట్లాడారు. నాయకులు రత్నమయ్య, వెంకటేష్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నార్పల: మండల కేంద్రంలోని సుల్తాన్‌పేట అంగన్‌వాడీ-1కేంద్రంలో సీడీపీఓ భారతి ఆధ్వర్యంలో వీరబాల దివస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సిక్కుల గురు గురు గోవిందసింగ్ కుమారులై ఫుతేసింగ్, జోలావర్‌సింగ్ ధైర్యసాహసాలను, త్యాగాలను స్మరించుకుంటూ వీరబాల దివాస్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ సునాలిని, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోడ్డు ప్రమాదాలు

కనగానపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాలు జరగాయి. కర్ణాటక ఆర్టీసీ బస్సు బెంగళూరు నుంచి అనంతపురం వెళుతోంది. మండలంలోని మామిళ్ళపల్లి వద్ద ముందు వెళుతున్న ట్రాక్టరును పొరపాటున వెనుకవైపు ఢీకొంది. అయితే బస్సులోని ప్రయాణికులతో పాటు ట్రాక్టరులో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు. ముక్తాపురం వద్ద ఎదురెదురుగా ఇన్నోవా, స్కార్పియో వాహనాలు ఢీకొన్నాయి. ఆయా వాహనాల్లోని వారు స్వల్పగాయాలతో బయట పడ్డారు. సంఘటన ప్రదేశాలను కనగానపల్లి పోలీసులు పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు ఎంపిక

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ అంతర కళాశాల క్రికెట్ పోటీల్లో గెలుపొందిన శ్రీవాణి డిగ్రీ కళా శాల విద్యార్థులు సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాగదుర్గ ప్రసాద్, ఆనంద్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వనజమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్‌రెడ్డి అభినందించారు.

ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్ టవర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఫెన్సింగ్ జట్లను ఎంపిక చేశారు. స్థానిక కొవ్వూర్‌నగర్‌లోని విద్యారణ్య పాఠశాల ఆవరణలో గురువారం జిల్లాస్థాయి ఫెన్సింగ్ సెలెక్షన్స్ నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, పుష్పావతి ప్రకటించారు. బాలుర విభాగంలో వెంకటసాయి, కార్తికేయ, సాయిసాత్విక్, నబర్, సూరజ్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో వందన, అమృత ఎంపికైన వారిలో ఉన్నారు. ఎంపికైన వారు శని, ఆదివారాల్లో కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు ప్రతాప్, లక్ష్మి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

వరుస విజయాలు స్ఫూర్తిదాయకం



క్రికెటర్లను అభినందిస్తున్న ఎస్ఎస్‌బీఎన్ యాజమాన్యం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్కే యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నీలో 18వ సారి విజేతగా నిలవడంతో ఎస్ఎస్‌బీఎన్ జట్టు క్రీడా ప్రోత్సాహకానికి స్ఫూర్తిగా నిలు స్తోందని కళాశాల యాజమాన్యం అన్నారు. ఇటీవల నిర్వహించిన ఎస్కే విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల టోర్నీ విజేతగా నిలిచిన ఎస్ఎస్‌బీ ఎన్ జట్టుకు గురువారం స్థానిక కళాశాలలో అభినందన సభ నిర్వహిం చారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి , ప్రెసిడెంట్ రమణారెడ్డి, సెక్రటరీ నిర్మలమ్మ, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రాజు, పీడీ ప్రసాద్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఐదు గడ్డి వాములు దగ్ధం

- రూ. 7 లక్షల ఆస్తి నష్టం



కాలిపోతున్న గడ్డివాములు

విడపనకల్లు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఐదు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన మల్లికార్జున పశువుల మేత కోసం గడ్డిని వామిగా వేసుకున్నాడు అని పాల్తూరు పోలీసులు తెలిపారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాములకు నిప్పు పెట్టారు. గమనించిన గ్రామస్థులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి మంటలను అదుపు చేశారు. ప్రమాదం లో రైతుకు రూ. 7లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు పోలీసులు తెలిపారు. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ గిడ్డి మారయ్య, జీబీసీ కాలువ అధ్యక్షుడు మారయ్య, నాయకులు కుమారుస్వామి, గడ్డం మారయ్య, గంగన్న కోరారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మవరం గేట్ సమీపంలో గురువారం ఐచర్ వాహనం ఢీకొని షికారి రేష్మా(74)అనే వృద్ధురాలు మృతి చెందింది. పట్టణంలోని షికారి కాలనీకి చెందిన రేష్మా, ఆమె మేనకోడలు నడుచుకుంటూ బజారుకు వెళ్తుండగా ధర్మవరం గేట్ సమీపంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద ఐచర్ వాహనం వెనుక నుంచి వృద్ధురాలిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వన్‌టౌన్‌పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీడబ్ల్యూడీ కార్యాలయంలో న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఈనెల 28 జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు న్యాక్ ఏడీ గోవిందురాజులు, డీఎస్‌డీఓ ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా కోర్సులు చేసిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భర్తపై ఫిర్యాదు

పుట్లూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన షెక్షావలిపై ఆయన భార్య రాజకుళ్లాయమ్మ గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. రోజూ తనపై అనుమానం వ్యక్తం చేస్తూ వేధిస్తున్నాడని, పిల్లలను కూడా సరిగా చూడడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పుట్లూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. తాడిపత్రి నుంచి చాలవేములకు తరలిస్తుండగా పుట్లూరు శివారులో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను సీజ్‌చేసి నాగేంద్రపై కేసు నమోదుచేశామన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోయిలపల్లికి చెందిన హనుమంతప్ప మృతి పార్టీకి తీరనిలోటని టీడీపీ నాయకుడు ధర్మతేజ అన్నారు. గురువారం పార్టీ సీనియర్ నాయకుడు హనుమంతప్ప మృతి చెందిన విషయం తెలుసుకుని ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. తెలుగుదేశం పార్టీ మీకు అండగా వుంటుందని భరోసా కల్పించారు.

దరఖాస్తు చేసుకోండి

గుత్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెప్మా ఆధ్వర్యంలో చేపడుతున్న జీవనోపాధికి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా తెలిపారు. బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, కార్పెంటర్ శిక్షణ కోసం ఈనెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళలు, పురుషులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

యల్లనూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల ఎస్ఐగా గురువారం రామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన రాంప్రసాద్‌ను అధికారులు వీఆర్‌కు పంపించారు. ఆయన స్థానంలో బనగానపల్లె నుంచి రామిరెడ్డిని ఇక్కడకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే సిబ్బందితో సమావేశమై మండల పరిస్థితులపై ఆరాతీశారు.

బ్యూటీషియన్ కోర్సుతో ఉపాధి

గుత్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బ్యూటీషియన్ కోర్సు చేసి ఉపాధి పొందాలని సీడీపీఓ ఢిల్లీశ్వరి పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సును నిర్వహించారు. 20 మంది విద్యార్థులు శిక్షణ పొంది కోర్సు పూర్తి చేశారు. వీరికి స్థానిక కార్యాలయంలో సర్టిఫికేట్ల ప్రదానం చేశారు. కోర్సు పూర్తి చేసిన వారు సర్టిఫికెట్‌తో ఉపాధి పొందుతూ బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చన్నారు. అనంతరం 20 మందికి సర్టిఫికేట్‌లను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, శిక్షకురాలు రాగిణి పాల్గొన్నారు.

ఆలయ పవిత్రతను కాపాడండి

తాడిపత్రి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న కల్యాణ మండపం పునఃనిర్మాణానికి ఆర్కియాలజీ అధికారులు అనుమతి ఇవ్వడంతో గురువారం నుంచి పనులు ప్రారంభించారు. ఓ వర్గం వారు చెప్పులు వేసుకొని కల్యాణమండపం పనులు చేస్తుండడాన్ని గమనించిన బీజేపీ, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు వారితో వాగ్వాదం చేశారు. పట్టణ ఇన్‌చార్జ్ సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ గౌస్‌బాషా అక్కడికి వెళ్లి ఇరువురితో చర్చించారు. ఆలయ పవిత్రతను కాపాడాలని, ఇలా పనులు చేయ కూడదని తెలిపారు. వారు అందుకు సమ్మతించడంతో వివాదం సద్దుమణిగింది.



ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు

పప్పుశనగకు తెగుళ్ల బెడద

● అనుకూలించని వాతావరణం
● మందుల పిచికారీతో మరింత భారం
● కుదేలవుతున్న రైతులు

బెళుగుప్ప, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పప్పుశనగ పంటను తెగుళ్ల బెడద వెంటాడుతోంది. ఒక వైపు ప్రతికూల వాతావరణంతో అల్లాడుతుండగా.. వేరు కుళ్లతో పాటు ప్రస్తుతం పైరుకు పసరు తెగులు సోకి నాశనమవుతుండటంతో ఆశలన్నీ నీరుగారుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటికి తోడు తుఫాను ప్రభావంతో చిరుజల్లులకు పూత నేలరాలి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పంట పూత పిందె దశలో వుంది. పైరంతా పసుపు రంగుగా మారి కాయల్లోని గింజ నాశిరకంగా తయారవుతోంది. తెగుళ్ల నివారణకు వేలాది రూపాయలు వెచ్చించి మందుల పిచికారి చేసినా ప్రయోజనం లేకుండాపోతోంది. వేర్లన్నీ తెల్లబారుతున్నాయి. వాతావరణం అనుకూలిస్తేనే గట్టెక్కుతామని రైతులు అంటున్నారు.



తెగుళ్లు సోకడంతో దెబ్బతిన్న పప్పుశనగ పంట

తెగుళ్లతో ఎండుతోంది



వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పప్పుశనగకు తెగుళ్లు సోకుతున్నాయి. ప్రస్తుతం పైరంతా పసుపురంగుగా మారి ఎండిపోతోంది. తెగుళ్ల ప్రభావంతో దిగుబడులపై ఆశలన్నీ నీరుగారుతున్నాయి. తుఫాను ఏమి నష్టం కలిగిస్తుందోనని ఆందోళన కలుగుతోంది.

- తిమ్మప్ప, రైతు, ఎర్రగుడి

ఒకే పంటతోనే తెగుళ్లు

మండలంలో కొన్నేళ్లుగా ఒకే పంట సాగు చేస్తున్నారు. పంట మార్పిడి లేనందువలన తెగుళ్ల ప్రభావం వుంటుంది. ఒక లీటరు నీటికి టేబు కొనజోల్ ఒక మిల్లీ లీటరు కలిపి చెట్టు తడిచేలా పిచికారి చేస్తే కొద్ది వరకు అరికట్టవచ్చు.

- పృథ్వీసాగర్, ఏవో, బెళుగుప్ప

ఘనంగా సీపీఐ శత వసంత వేడుకలు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వసంత వేడుకలను గురువారం ఊరూరా నిర్వహించి ఎర్రజెండాలను ఎగురవేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలుచోట్ల సమావేశాలు నిర్వహించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు యోధులు అనేక మంది త్యాగాలు చేశారని, జైలుకెళ్లారని, ప్రాణాల సైతం తృణప్రాయంగా అర్పించారని నాయకులు కొనియాడారు. నేటికీ కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర ఉద్యమాలు చేస్తోందని తెలిపారు. గుంతకల్లు పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారత దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, గోపినాథ్, ఎస్ఎండీ గౌస్, రాములరాయల్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం సీపీఐ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బీరప్ప సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకుకొనసాగింది. రాయదుర్గం పట్టణంలో మొల్కామూరు చెక్‌పోస్టు వద్ద సీపీఐ శత దినోత్సవ కార్యక్రమాన్ని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ సంజీవప్ప జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు తిప్పేస్వామి, దుర్గన్న, నరసింహులు, అయేషా పాల్గొన్నారు. కణేకల్లులో వందవ సంవత్సర సంబరాలు జరుపుకున్నారు. నాయకులు గౌస్‌పీర్, సర్మాస్ వలి, బషీర్, అనుమేష్ పాల్గొన్నారు. ఉరవకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు తిప్పయ్య జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు శివన్న, మల్లేష్, సుల్తాన్, వన్నూరమ్మ, ఖాజా, చక్రధర్, గంగాధర్ పాల్గొన్నారు. పామిడి మండల కేంద్రంలో సీపీఐ నాయకులు ఆవిర్బవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సూర్యనారాయణరెడ్డి, పెద్ద చౌడప్ప, రమేష్, నారాయణస్వామి, ఓంకారప్ప పాల్గొన్నారు. కళ్యాణదుర్గం టీ సర్కిల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, నాయకులు బుడేన్, లక్ష్మీదేవి, సునిల్, నవీన్, పవన్, హసీనా, గౌరమ్మ, అంజలి పాల్గొన్నారు. తాడిపత్రి పట్టణంలో నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ వేర్వేరుగా శతవార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా నాయకుడు రాజారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న కష్టజీవులు, శ్రమజీవుల తరపున పోరాడుతున్న ఏకైక పార్టీ సీపీఐ అని ఆయన తెలిపారు. వేడుకల్లో నాయకులు శ్రీరాములు, నాగేంద్ర, రామాంజి, రమణ, నారాయణరెడ్డి, నాగరంగయ్య పాల్గొన్నారు. విడపనకల్లు బస్టాండ్‌లో సీపీఐ నాయకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎంటీ చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు. పెద్దవడుగూరులోని సీపీఐ కార్యాలయంలో సీనియర్ నాయకుడు లింగన్న పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరాముడుయాదవ్, నారాయణ పీరా, సుధాకర్‌గౌడ్, అల్లాబకాష్, ఆదినారాయణ, సుధాకర్‌రెడ్డి, రామయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.





గుంతకల్లు, తాడిపత్రి పట్టణాల్లో సీపీఐ శత వసంత వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

భూ సమస్యలను పరిష్కరించుకోండి: ఆర్డీఓ

ఉరవకొండ/యాడికి/రాయదుర్గంరూరల్/బ్రహ్మసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలను పరిష్కరించుకోవాలని ఆర్డీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉరవకొండ మండలంలోని ఆమిద్యాల గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూమి వివరాలను సక్రమంగా ఉంచుకోవడం వల్ల అమ్మాలన్నా, కొనుగోలు చేయాలన్నా ఇబ్బందులు తలెత్తవన్నారు. రైతులు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సులో 39 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు మహబూబ్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్ అధికారి విజయ్‌కుమార్, ఏఎంసీ మాజీ చెర్మన్ మారెన్న, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, టీడీపీ నాయకులు శ్రీధర్ పాల్గొన్నారు. యాడికి మండలంలోని కుందనకోట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కిష్టప్ప, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. రాయదుర్గం మండలంలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ రైతులు చిన్న చిన్న సమస్యలను పరిష్కరించేందుకు చక్కటి అవకాశం అన్నారు. సమస్యలుంటే అర్జీ పూర్వకంగా ఇస్తే 45 రోజుల లోపల పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మణికాంత్, ఆర్ఐ రామాంజినేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు. బ్రహ్మసముద్రం మండల పరిధిలోని ఎరడికెర గ్రామంలో సర్పంచ్ అంజినమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుమతి మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందాయని ఆర్ఐ నాగిరెడ్డి తెలిపారు.



ఉరవకొండ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

యూటీఎఫ్ ప్రచారజాతా ప్రారంభం



గుంతకల్లు ప్రచారజాతాలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

గుంతకల్లు టౌన్/ఉరవకొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు పట్టణంలోని భగత్‌సింగ్ పురపాలక ప్రాథమిక పాఠశాల నుంచి గురువారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ ప్రచారజాతను ప్రారంభించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప పతాకాన్ని, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ 50 సంవత్సరాల కాలంలో ఉద్యోగ్య ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈ జాతా గుంతకల్లు నుంచి ఉరవకొండ, రాయదుర్గం, కల్యాణదుర్గం మీదుగా సత్యసాయి జిల్లాకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాఘవేంద్ర, దేవేంద్రమ్మ, రామప్ప చౌదరి, సరళ, శేఖర్, రాజ్‌కుమార్, కల్పన, గిరిబాబు, సభ్యులు పాల్గొన్నారు. ఉరవకొండ పట్టణంలో గురువారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహా సభలను పురస్కరించుకుని ప్రచార జాత నిర్వహించారు. గుంతకల్లు నుంచి ప్రారంభమై ఉరవకొండకు చేరుకుంది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, నాయకులు శేఖర్, రామప్పచౌదరి, లింగమయ్య, జయరాములు, లక్ష్మీనారాయణ, ఉమాపతి, ఇస్లాం బాషా, రఘు, ధనుంజయ పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏఓను సస్పెండ్ చేయాలి



సూపరిండెంటెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్న ఏఓ రాంప్రసాద్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బి. సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ఆజేంద్రరావుకు ఆ పార్టీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మాముళ్ల కోసం డాక్టర్లు, పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులను ఏఓ వేధింపులకు గురిచేస్తున్నాడన్నారు. సిబ్బందిని అసభ్యపదజాలంతో దూషిస్తున్నాడన్నారు. ప్రత్యేక గదిని ఏర్పాటు చేసుకుని సిబ్బంది వేధిస్తున్నాడని పేర్కొన్నారు. ఏఓపై విచారణ జరిపించాలని, అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, జిలాన్, షేక్షావలి, నారాయణ, బాష, రామదాసు, విశ్వనాథ్, రంగానాయక్ పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందాలను అమలు చేయండి

మున్సిపల్ కార్మికుల డిమాండ్.. ఆందోళన

కళ్యాణదుర్గం రూరల్/రాయదుర్గం రూరల్/గుత్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గత సంవత్సరం నిర్వహించిన సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కళ్యాణదుర్గంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ అశ్వర్ధనారాయణకు వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరంలో 16 రోజుల పాటు నిర్వహించిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శివ, వన్నూరుస్వామి, నాయకులు తిమ్మప్ప, రమణ, శివకుమార్, వన్నూరు స్వామి, హనుమంతు, లక్ష్మీదేవి, దుర్గమ్మ, అలివేలమ్మ, యల్లక్క పాల్గొన్నారు.

● రాయదుర్గంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు నాగరాజు, రాము, మల్లేష్, సిద్ధలింగ, తిప్పేరుద్ర పాల్గొన్నారు. గుత్తిలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, రామాంజనేయులు, మహేష్ సుంకన్న, బాలరంగన్న పాల్గొన్నారు.





కళ్యాణదుర్గంలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, రాయదుర్గంలో కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గురుకుల పాఠశాలకు ఐదెకరాల వితరణ



స్థలానికి సంబంధించిన అంగీకార పత్రాన్ని ఇస్తున్న గంగమ్మ

కుందుర్పి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలకు పామరాతి గంగమ్మ ఐదు ఎకరాల భూమిని వితరణ చేశారు. గురువారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి తహసీల్దార్ శ్రీనివాసులుకు ఆమె ఐదు ఎకరాల భూమికి సంబంధించిన అంగీకార పత్రాన్ని అందజేశారు. గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఆమె స్పందించి స్వచ్ఛందంగా ఐదు ఎకరాల భూమిని కేటాయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ధనుంజయ, నాయకులు పెద్ద నరసింహప్ప, మల్లికార్జున, రామ్మూర్తి పాల్గొన్నారు.

రైతులు వర్సెస్ వైసీపీ నాయకులు

యాడికి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులోని చెరువు మట్టి వ్యవహారం గురువారం సర్వత్రా చర్చనీయాంశమైంది. చెరువు మట్టిని తోలుకోవడానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు. మట్టితోలుతున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ వైసీపీ నాయకులు పోలీసులకు, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రైతులు ఒక పక్క వినతి పత్రాలు, వైసీపీ నాయకులు మరోవైపు ఫిర్యాదులు చేయడంతో చెరువు మట్టి అంశం హాట్‌టాపిక్‌గా మారింది. అధిక ధరలు వెచ్చించి ఎరువులు కొనలేక చెరువు మట్టిని తోలుకుంటున్నామని రైతులు తెలిపారు. తాము సొంత ఖర్చులతో వాహనాలను పెట్టుకొని చెరువు మట్టిని తోలుకుంటుంటే వైసీపీ నాయకులు రాజకీయం చేయడం తగదన్నారు. ప్రస్తుతం మట్టిని పొలాలకు తోలుకుంటే జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరినెలలో అరటి పంటలు సాగు చేయడానికి అనుకూలమని, అధికారులు అనుమతి ఇవ్వాలని కోరారు. చెరువులో మట్టిని టీడీపీ నాయకులు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదుచేశామని తెలిపారు. నామమాత్రంగా చర్యలు చేపట్టి రెండు టిప్పర్లను మాత్రమే సీజ్‌చేశారని పేర్కొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గుంతకల్లు టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే గ్రౌండ్ సమీపంలో వెలసిన లక్ష్మీగణేష్ దేవాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున వినాయకుడి మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణ చేశారు. ఉదయం జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో యంత్రప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి, మహామంగళ హారతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రామకృష్ణయ్య, అధ్యక్షుడు ఎస్. సురేష్‌గుప్త, కార్యదర్శి వి. లక్ష్మీనారాయణగుప్తా, కోశాధికారి దేవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

తాడిపత్రి : మండలంలోని కడప రహదారిలో ఉన్న భగుళాముఖిదేవి అమ్మవారి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకుల మంత్రోచ్ఛారణలతో అమ్మవారు, త్రిశూలాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

పామిడి : మండలంలోని ఓబుళాపురం గుట్టపై దొడ్డ ఓబుళేసుస్వామి దేవాలయంలో గురువారం పంచలోహ విగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠ చేశారు. అయ్యవారిపల్లి దామోదర్‌రెడ్డి చేయించిన లక్ష్మి, నరసింహస్వామి పంచలోహ విగ్రహాలు ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవి, నరసింహస్వాముల కల్యాణం నిర్వహించారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

బొమ్మనహాళ్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రగిరి గ్రామంలో ఓ ద్విచక్రవాహనానికి గుర్తు తెలియని దుండగులు బుధవారం అర్ధరాత్రి నిప్పుపెట్టారు. గ్రామంలోని చంద్ర అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనానికి దుండగులు నిప్పుపెట్టారు. చంద్ర అనే వ్యక్తి ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వాహనంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. మంటలు ఎక్కువగా రావడంతో పక్కింటివారు అతడిని లేపారు. మంటలను ఆర్పేలోపు ద్విచక్రవాహనం కాలిపోయింది. దీంతో గురువారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆరోగ్య కార్యకర్తలను విధుల్లోకి తీసుకోండి

బొమ్మనహాళ్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలను ఇటీవల తొలగించారని, ప్రభుత్వం తిరిగి విధుల్లోకి తీసుకోవాలని బొమ్మనహాళ్ మండలంలో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన్, రమణ, నాగేంద్ర తదితరులు గురువారం ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు విన్నవించారు. 22 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. 50 సంవత్సరాలు వయస్సు పైబడిన వారు ఉన్నామని, ఈ సమయంలో తొలగిస్తే ఎలా అన్నారు. కాలవ శ్రీనివాసులు స్పందిస్తూ ఆరోగ్యశాఖమంత్రితో మాట్లాడి తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

కణేకల్లు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు వద్ద వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో గ్రామోత్సవం సందర్భంగా ఉదయమే గణపతిపూజతో పాటు అయ్యప్పస్వామి, సుబ్రమణ్యం స్వాములకు నెయ్యి అభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పుణ్యాఃవచనం, నవగ్రహ ఆరాధన, ప్రధాన కళశ స్థాపన, మహాపూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

గుత్తి : పట్టణంలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో మండల పూజ ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయమే గణపతి హోమం, అయ్యప్పస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేక రథంలో ఉంచి ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాడిపత్రి : పట్టణంలోని పుట్లూరు రోడ్డులో ఉన్న అక్కమహాదేవతల 24వ గ్రామోత్సవం గురువారం అంగరంగవైభవంగా జరిగింది. ఆలయంలో అక్కమహాదేవతామూర్తులకు, శివపార్వతులకు అభిషేకాలు, కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణంతోపాటు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అక్కమహాదేవతల ఉత్సవమూర్తులను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సంలో పసుపు వస్త్రాలు ధరించిన మహిళలు 216 కలశాలను తలపై ఉంచుకొని ఆలయం నుంచి పుట్లూరురోడ్డు, సీబీరోడ్డు, అశోక్‌పిల్లర్, మెయిన్‌బజారు, పోలీస్‌స్టేషన్‌రోడ్డు మీదుగా ఆలయానికి చేరుకున్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: ఎస్ఐ

పుట్లూరు, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ హేమాద్రి పేర్కొన్నారు. మండలంలోని కడవకల్లు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు చెడు అలవాట్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, మద్యం తదితర అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లరాదన్నారు. ఇవన్నీ మీ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లయితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఘనంగా వీర బాల దివస్

గుంతకల్లుటౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సుమేధ పాఠశాలలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో వీర బాల దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ సిక్కుల గురువు గురు గోవింద్ సింగ్ కుమారులు బాబాజోరవసింగ్, బాబాఫతేసింగ్‌లా ఆత్మబలిదానం జ్ఞాపకార్థం వీర బాల దివస్ జరుపుకుంటున్నామన్నారు.